

మీడియాకు వివరాలు తెలుపుతున్న సీఎం, డీసీఎం

18 వరకూ కులగణన సర్వే

● ప్రభుత్వ పాఠశాలలకు దసరా సెలవుల పొడిగింపు


బెంగళూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జరుగుతున్న కులగణన సర్వే 18వ తేదీ వరకూ పొడిగించినట్లు ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రకటించారు. విధాన సౌధలో మంగళవారం కులగణన సర్వేపై సమీక్ష జరిపిన సీఎం, డీసీఎం డీకే శివకుమార్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. సెప్టెంబరు 22న సర్వే ప్రారంభం కాగా 7వ తేదీతో ముగించేలా గడువు ఉండేదన్నారు. కానీ రాష్ట్ర మంతటా సర్వే పూర్తికాకపోవడంతో పాటు బెంగళూరులో ప్రక్రియ ప్రారంభించి కేవలం నాలుగు రోజులు కావడంతో అన్నిచోట్లా సర్వే జరుగుతోంది. దీంతో సర్వేను 18వ తేదీ వరకు పొడిగించినట్లు సీఎం తెలిపారు. అందుకు అనుగుణంగానే ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలకు దసరా సెలవులను 18వరకూ పొడిగించినట్లు తెలిపారు. ఇటు ఉపాధ్యాయ సంఘాలతో పాటు పలువురు ఎమ్మెల్సీలు వినతి మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. బెంగళూరు నగరంలో 6700 మంది ఉపాధ్యాయులు సర్వేలో పాల్గొంటున్నారన్నారు. బెంగళూరులో 46లక్షల కుటుంబాలకు చెందిన సర్వే జరగాల్సి ఉన్నందున పొడిగించారు. 12నుంచి పీయూసీ విద్యార్థులకు మధ్యంతర పరీక్షలు జరగనున్న తరుణంలో పీయూ కళాశాల అధ్యాపకులకు సర్వే బాధ్యతల నుంచి మినహాయింపు ఇచ్చారు. కులగణన సర్వేలో పాల్గొన్న ఉద్యోగులు ముగ్గురు వివిధ కారణాలతో మృతి చెందారని, వారి కుటుంబాలకు రూ.20లక్షలు చొప్పున పరిహారం అందిస్తామన్నారు. దక్షిణకన్నడ జిల్లాలో 97శాతం సర్వే జరిగిందని ఉడుపిలో 63శాతం సాధ్యమైందన్నారు. మిగిలిన జిల్లాల్లో ఆశించనంత మేర సర్వే జరుగలేదన్నారు.

శాసనసభ స్పీకర్‌కు గౌరవ డాక్టరేట్



స్పీకర్ యుటీ ఖాదర్

బెంగళూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): బెంగళూరు విశ్వవిద్యాలయం 60 స్నాతకోత్సవం సందర్భంగా శాసనసభ స్పీకర్ యుటీ ఖాదర్‌కు గౌరవడాక్టరేట్ ఇస్తున్నట్లు వైస్ చాన్స్‌లర్ డాక్టర్ జయకర్ తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బుధవారం స్నాతకోత్సవం జరుగుతుందన్నారు. సమాజసేవకులు డి.మాదేగౌడ, జేపీ అగ్రిజెన్‌టెక్స్ ఫౌండర్, చైర్మన్ డాక్టర్ టీబీ ప్రసన్నలకు గౌరవడాక్టరేట్ ఇస్తామన్నారు. గవర్నర్ థావర్‌చంద్‌గెహ్లాట్, డీఆర్‌డీఎల్ మాజీ డైరెక్టర్ పద్మశ్రీ డాక్టర్ ప్రహ్లాద్ రామారావ్, ఉన్నత విద్యాశాఖ మంత్రి డాక్టర్ సుధాకర్‌లతో పాటు పలువురు పాల్గొంటారన్నారు.



గౌరవ డాక్టరేట్ అందుకోనున్న మాదేగౌడ, డాక్టర్ టీబీ ప్రసన్న

నాయకత్వంలో 20శాతం పెరిగిన
మహిళా సాధికారత



బెంగళూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా నాయకత్వంలో మహిళా సాధికారత 20శాతం పెరిగిందని వర్క్‌ప్లేస్ కన్సల్టింగ్ కంపెనీ అవ్తార్ ప్రకటించింది. అవ్తార్ అండ్ సెరామెంట్ వివిధ సంస్థలతో కలిసి అధ్యయనం చేశారు. అవ్తార్ సంస్థ ఫౌండర్, చైర్మన్ డాక్టర్ సౌందర్య రాజేష్ పేరిట మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పది విడతల అధ్యయనం ప్రకారం రాష్ట్రంలోనే కాకుండా దేశవ్యాప్తంగా గణనీయంగా విభిన్నరంగాలలో మహిళల లీడర్‌షిప్ పెరిగినట్లు పేర్కొన్నారు. ఉత్తమ కంపెనీలలో 35.7శాతం కాగా వృత్తిపరమైన సేవలలో 44.6శాతం ఉద్యోగాలను మహిళలు సాధించినట్లు పేర్కొన్నారు. ఐటీఈస్ అనుబంధం సంస్థలలో 41.7శాతం ఫార్మారంగంలో 25శాతం అధికం కాగా ఎఫ్ఎంసీజీ సంస్థలలో 23 శాతం, ఉత్పాదనా రంగంలో 12శాతం సాధించినట్లు పేర్కొంది. మహిళలతో పాటు పురుషులు ఉద్యోగాలు వదులుతున్న విధానంపైనా అధ్యయనం చేసినట్లు పేర్కొన్నారు. ప్రధానంగా పనిచేసే కంపెనీ మారేందుకు వేతనం, హోదా బ్రాండెడ్ కంపెనీలే కారణంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ ఏడాదికి సంబంధించి 10 బెస్ట్ ఉమెన్ కంపెనీలలో అక్సెంచర్ సొల్యూషన్స్ నిలిచినట్లు పేర్కొన్నారు. 2019లో దివ్యాంగులకు 58 కంపెనీలు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తే ప్రస్తుతం 100శాతం పెరిగిందని ఏకంగా 9687 మందికి ఉద్యోగాలు ఇచ్చారన్నారు. 2016లో సరాసరిన మహిళా ప్రాతినిధ్యం 25శాతం ఉండేదని ప్రస్తుతం 35.7శాతం పెరగడం ఆశాదాయకమని పేర్కొన్నారు.

పాత వాహనాలపై..
సెంటిమెంట్..!

● 15 ఏళ్లు దాటినా గుజరీకి ససేమిరా
● రెండేళ్లలో 1 శాతం దాటని స్క్రాప్



ఇంటిచెంతనే ఉంచుకున్న పాత కారు

బెంగళూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): వాహనం కొనుగోలు చేసేవేళ ఎన్నో ఆశలు, ఆశయాలు, ముహూర్తాలు చూసుకుంటారు. కొత్త వాహనం ఇంటికి వచ్చే వేళ మంచి జరగాలని భావిస్తారు. మరికొందరైతే వాహనం లక్కీ నంబరు కోసం ఓ రూ.20వేలు ఖర్చు చేసేందుకు వెనకాడరు. అదే నంబరుకోసం పోటీ పడితే వేలంలోనూ దక్కించుకునేందుకు సిద్ధమవుతారు. ఇలా వాహనం అంటే ఎన్నో విధాలా అనుబంధం పెంచుకుంటారు. కానీ 15 ఏళ్లు పూర్తయిన తర్వాత వాహనం రోడ్డుపై తిప్పకూడదని కేంద్రం షరతు విధించింది. అయితే వాహనాలపై సెంటిమెంట్ పెట్టుకున్నవారు గుజరీకి వేసేందుకు వెనుకాడుతున్నారు. ఏకంగా రెండేళ్ల వ్యవధిలో ఒకశాతం పాత వాహనాలు కూడా గుజరీకి చేరలేదు. ఇలా దశాబ్దన్నరకాలం దాటిన లక్షలాది వాహనాలు రయ్... రయ్... అంటూ తిరిగేస్తున్నాయి. 15 ఏళ్లు దాటితే సాధారణంగా వాహనాలకు మరమ్మతులు పెరుగుతాయి. ఒక్కోసారి ఇంజన్ కూడా సీజ్ అవుతుంది. ఇలా ప్రతినెలా అదనంగా ఖర్చు పెట్టుకోవాల్సి ఉంటుంది. వాటన్నింటికీ సిద్ధమే అంటున్న వాహనదారులు సెంటిమెంట్‌ను మాత్రం వదులుకునేందుకు సిద్ధంగా లేరనిపిస్తోంది.

● రిజిస్టర్ అయిన వాహనం 15 ఏళ్లు పూర్తయితే వాటిని వాడరాదని, కేంద్రప్రభుత్వం దేశవ్యాప్తంగా 2023 ఏప్రిల్ 1న గుజరీకి వేయాలనే పాలసీని తీసుకువచ్చింది. రాష్ట్రంలోనూ అదే రోజునుంచే నిబంధనలు వర్తింపచేసేలా ఆదేశించింది. కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ రాష్ట్రంలో ప్రభుత్వంతోపాటు ప్రైవేట్‌కు సంబంధించి 15 ఏళ్లు దాటిన వాహనాలు కోటిదాకా ఉన్నట్టు గుర్తించారు. రవాణాశాఖ గణాంకాల ప్రకారం రాష్ట్రంలో ఇతర జిల్లాలు, నగరాలతో పోలిస్తే బెంగళూరులోనే దశాబ్దన్నర దాటిన వాహనాలు 34లక్షల దాకా ఉన్నాయి. వీటిలో ద్విచక్రవాహనాలు 21 లక్షలు కాగా, 7 లక్షల కార్లు, 6 లక్షల ఇతర వాహనాలు ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 15ఏళ్లు దాటిన ద్విచక్రవాహనాలు 69 లక్షల దాకా ఉన్నాయి. అధికారిక గణాంకాల ప్రకారం రాష్ట్రంలో 15ఏళ్లు పూర్తయిన వాహనాలపైకి 14లక్షలు ప్రభుత్వ వాహనాలే ఉన్నాయి. మిగిలిన 86 లక్షలు ప్రైవేట్ వ్యక్తులు, సంస్థలకు చెందినవిగా ఉన్నాయి. రవాణాశాఖ పాత వాహనాలను గుజరీకి వేసేందుకు తప్పనిసరి చేయలేదు. వాహనదారులు ఇష్టమైతేనే తమ వాహనాలను గుజరీకి వేసుకునే అవకాశం ఇచ్చింది. అయితే ప్రభుత్వ వాహనాలకు తప్పనిసరి లేకపోవడంతో వారు యథావిధిగా వాహనాలు వాడుతున్నారు.

● పాత వాహనాలను ధ్వంసం చేసేందుకు బెంగళూరులోని దేవనహళ్ళి, తుమకూరు జిల్లా కొరటగెరెలో ప్రత్యేక గుజరీ కేంద్రాలకు అనుమతి ఇచ్చారు. రెండేళ్లగా 3వేల వాహనాల యజమానులు మాత్రమే గుజరీకి తీసుకొచ్చి ధ్వంసం చేయించారు. వివిధశాఖలకు సంబంధించి పూర్తిగా నిర్వీర్యమైన 4వేల వాహనాలను గుజరీకి వేశారు. గుజరీకి వాహనాన్ని అప్పగిస్తే తూకం ప్రకారం డబ్బులు చెల్లిస్తారు. ఇందుకు సంబంధించి సదరు కేంద్రం ప్రత్యేక ప్రమాణపత్రాన్ని అందిస్తారు.

పన్ను మినహాయింపు ఉన్నా..

పాత వాహనాలు గుజరీకి వేసి కొత్త వాహనాలను కొనుగోలు చేసేవారికి పన్ను మినహాయింపు వెసలుబాటు కల్పించారు. పాత వాహనం గుజరీకి వేసినందుకు సదరుకేంద్రం ఇచ్చిన సర్టిఫికెట్‌ను కొత్త వాహనం కొనుగోలు చేసేవేళ సమర్పిస్తే పన్ను మినహాయింపు వెసలుబాటు దక్కుతుంది. రవాణాయేతర వాహనాలకు 25శాతం, రవాణావాహనాలకు 15శాతం మినహాయింపు ఇస్తారు. పాత వాహనాలకు సంబంధించి పన్ను వివరాలు అందుబాటులో లేకున్నా కొత్త వాహనం కొనుగోలు చేసేవేళ వాటి విలువ ఆధారంగా వాహన యజమానులకు నేరుగా రోడ్‌ట్యాక్స్ మినహాయింపు ఇస్తారు. కొత్త ద్విచక్రవాహనాలకు రూ.1000 నుంచి 5వేల దాకా రాయితీ దక్కనుంది. కార్లు వంటి వాహనాలకు రూ.10వేల నుంచి 40వేల దాకా పన్ను మినహాయింపు ఉంటుంది. రవాణా వాహనాలు కొనుగోలుకు ఎనిమిదేళ్ల దాకాను, రవాణాయేతర వాహనాలకు 15ఏళ్ల వరకు పన్ను రాయితీ అవకాశం కలదు. ఇలా పన్నురాయితీ అవకాశం కల్పించినా 15ఏళ్లు దాటిన వాహనాలను గుజరీకి వేసేందుకు అత్యధికశాతం ప్రజలు సుముఖత చూపడం లేదు. కాగా 15ఏళ్లు దాటిన వాహనాలకు రెన్యువల్ చేసుకునేందుకు ఫాం 25, ఒరిజినల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్(ఆర్‌సీ), ఇన్సూరెన్స్ సర్టిఫికెట్, పొల్యూషన్ అండర్ కంట్రోల్ సర్టిఫికెట్ వంటివి సమర్పించాల్సి ఉంటుంది. సదరు సర్టిఫికెట్‌లతో ఆర్టీఓ కార్యాలయానికి వాహనాన్ని తీసుకెళ్లి ఇన్‌స్పెక్షన్ చేయించుకోవాలి. రీ-రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లిస్తే కొత్త ఆర్‌సీని మంజూరు చేస్తారు.

హాసనాంబ జాతర

● రేపు తెరుచుకోనున్న ఆలయం ● ఏడుగురికి మాత్రమే ఎస్కార్ట్ వ్యవస్థ



హాసనాంబ ఆలయ ముఖద్వారం

బెంగళూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఏడాదికోసారి మాత్రమే తెరిచే హాసనాంబదేవి ఆలయంలో అమ్మవారి దర్శనాల విషయంలో ప్రభుత్వం కొత్త విధానం తీసుకువచ్చింది. హాసన్ జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులతో ప్రత్యేక సమీక్ష వికాససౌధలో సోమవారం జరిగింది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి కృష్ణబైరేగౌడ పలు కొత్త ప్రతిపాదనలు తీసుకువచ్చినట్లు మీడియాకు వెల్లడించారు. హాసనాంబ దేవి దర్శనాలకు వీఐపీ దర్శనాలను పూర్తిగా రద్దు చేశామన్నారు. గురువారం నుంచి జాతర ప్రారంభం కానుందని అదే రోజున హాసనాంబ దేవీ ఆలయం తెరిచే విధానం సాగుతుందన్నారు. గతంలో ఉండే వీఐపీ సంప్రదాయాలను పూర్తిగా రద్దు చేస్తామన్నారు. కేవలం ఏడుగురు మాత్రమే ఎస్కార్ట్ విధానంతో ఆలయానికి వచ్చే విధానం అమలు చేస్తామన్నారు. అందులో గవర్నర్, ముఖ్యమంత్రి, డీసీఎం హోంమంత్రి, సుప్రీం కోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు, మాజీ ప్రధానమంత్రికి మాత్రమే వెసులుబాటు ఉంటుందన్నారు. ప్రైవేటు వాహనాల ద్వారా ఆలయం వద్దకు వచ్చే అవకాశం నిలిపివేశామన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, జడ్జిలు, క్రీడాకారులు, సినిమానటులతో పాటు ఇతర ప్రముఖులు ఆలయ సందర్శనకు వచ్చేందుకు ముందుగానే మెయిల్ లేదా ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వాల్సి ఉంటుందన్నారు. పార్కింగ్ ప్రదేశంలోనే వాహనాలను నిలపాల్సి ఉంటుందని ప్రముఖుల కోసం ప్రత్యేకంగా జిల్లా యంత్రాంగం సిద్ధం చేసిన వాహనాల ద్వారా ఆలయం దాకా తీసుకువచ్చి దర్శనాలు చేయిస్తామన్నారు. రూ.30 నుంచి 1000 విలువతో ప్రత్యేక పాసులు మంజూరు చేస్తామన్నారు. పాసులు తీసుకున్నవారికి ప్రత్యేకంగా ప్రసాదం పంపిణీ చేస్తామన్నారు. ఎస్కార్ట్‌తో వచ్చే ప్రముఖులకు ఉదయం 7.30గంటల నుంచి రెండుగంటల పాటు రాత్రి 7గంటల నుంచి 10గంటల వరకూ వెసలుబాటు ఉంటుందన్నారు. పాసులు కూడా రోజుకు కేవలం 1000లు మాత్రమే ఇవ్వాలని తీర్మానించామన్నారు. హాసనాంబ దేవీ దర్శనం జనస్నేహి చేయాలనేది మా ఆశయమన్నారు. హాసనాంబ దేవీ దర్శనాలకు వచ్చే భక్తుల సంఖ్య ఏటా పెరుగుతోందని 2021లో లక్ష మంది దర్శించుకోగా 2022లో 3లక్షల మంది, 2023లో ఆరులక్షల మంది దర్శించుకోగా గత ఏడాది ఏకంగా 20లక్షల మంది దర్శనాలు వచ్చారన్నారు. ఈ ఏడాది కనీసం 25 లక్షల మంది భక్తులు హాసనాంబ దేవీ దర్శనంకు వచ్చే అవకాశం ఉంటుందని అంచనా వేశామని ఆదిశగానే జిల్లా యంత్రాంగా ఏర్పాట్లు, సౌకర్యాలు కల్పించేందుకు సిద్ధంగా ఉందన్నారు. 9వతేదీ శుక్రవారం నుంచే సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని ప్రత్యేకంగా మూడు వేదికలు సిద్ధం చేశామన్నారు. భద్రతా చర్యలలో భాగంగా 2వేల మంది పోలీసులను నియమించామని అదనంగా 280 సీసీ కెమెరాలను అమర్చామన్నారు.

పైప్‌లైన్ కోసం తవ్వారు.. వదిలేశారు..!

● ఇబ్బంది పడుతున్న వాహనదారులు, ప్రజలు



గుంతలు పూడ్చకపోవడంతో అధ్వానంగా మారిన సీసీ రోడ్డు

బళ్ళారి గాంధీనగర్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): నగరంలో తాగు నీరు, యూజీడీ పైప్‌లైన్ ఏర్పాటు కోసం బాగున్న రోడ్లను తవ్వి... పనులు ముగిసిన తరువాత అలాగే వదిలి వేయడంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. బళ్ళారి నగరంలో ఇలాంటి దృశ్యాలు సర్వసాధారణంగా మారాయి. పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు ఎంత త్వరగా పనులు ముగించి బిల్లుల కోసం ఆరాటపడతారు తప్ప చేసిన పనుల్లో నాణ్యత ఎంతనే అనే విషయాన్ని విస్మరిస్తున్నారు. దీనికితోడు సంబంధిత శాఖ అధికారులు కూడా పైప్‌లైన్ కోసం రోడ్డును తవ్విన తరువాత... రోడ్డును బాగు చేయాలని నిబంధనలు ఉన్నా వాటిని పట్టించుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నగరంలోని సంగనకల్లు వెళ్లే అండర్‌పాస్‌లో ఏడాది క్రితం యూజీడీ పైప్‌లైన్ కోసం సీసీ రోడ్డు తవ్వారు. పనులు ముగిసి ఏడాది గడిచినా తవ్విన గుంతలు అలాగే వదిలి వేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ రోడ్డుపై నిత్యం వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. సంబంధిత కార్పొరేషన్ అధికారులు గాని, ప్రజా పనుల శాఖ అధికారులు గాని పట్టించుకోవడం లేదని నగర ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు తవ్విన రోడ్డుకు మరమ్మతులు చేయించాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఒక్కరికే రెండు కార్డులు

● కుల గణలలో బయటపడ్డ మోసం
● సర్వే చేస్తున్న ఉద్యోగిపై కార్డుదారుడి దాడి

బెంగళూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): కులగణనలో రోజుకో వింత అంశం వెలుగులోకి వస్తోంది. కొందరు మేం సర్వేకు సిద్ధంగా లేమని, మేం చెప్పింది రాసుకోవాలని ఉద్యోగులను ఇబ్బంది పెడుతున్న విషయం తెలిసిందే. పలు చోట్ల సర్వే చేస్తున్న ఉద్యోగులు ఆందోళన చేస్తున్నారు. ఇలా సాగుతుండగానే మండ్య జిల్లా శ్రీరంగపట్టణ తాలూకా గంజాం అనే గ్రామంలో సర్వే చేస్తున్న ఉపాధ్యాయుడు జనార్ధన్ ఆధార్ కార్డులను సర్వే కోసం సేకరించారు. సదరు కుటుంబానికి వేర్వేరు పేర్లతో రెండు బీపీఎల్ రేషన్ కార్డులు ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. ఇదే విషయాన్ని ఉద్యోగి ప్రశ్నించడంతో ఒక్కసారిగా వారు ఆగ్రహానికి లోనయ్యారు. సర్వే చేస్తున్న నమూనాలను లాగేసుకున్నారు. మొబైల్‌లో చేస్తున్న సర్వే కావడంతో వాటిని తొలగించేశారు. ఉపాధ్యాయుడిపై దాడి విషయం తెలియగానే సర్వే పర్యవేక్షణాధికారులు అక్కడికి చేరుకున్నారు. కాగా దౌర్జన్యానికి పాల్పడిన వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. హాసన్ జిల్లా బేలూరు పట్టణంలో సర్వే చేసేందుకు వెళ్ళిన ఉపాధ్యాయురాలు చిక్కమ్మపై కుక్కలు దాడి చేశాయి. ఆమెకు స్వల్ప గాయాలయ్యాయి.

మైసూరులో పట్టపగలు దారుణ హత్య



సీసీ టీవీ ఫుటేజీలో లభ్యమైన హత్య దృశ్యాలు

బెంగళూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): సాంస్కృతిక నగరి మైసూరులో పట్టపగలు దారుణహత్య జరిగింది. దసరా ఉత్సవాలతో సందడిగా సాగిన మైసూరు ఇప్పుడే ప్రశాంత వాతావరణ పరిస్థితికి వస్తున్న తరుణంలోనే హత్య జరిగింది. క్యాతమారనహళ్ళి నివాసి వెంకటేష్ మంగళవారం మధ్యాహ్నం మైసూరు దసరా ఉత్సవాలలో భాగంగా ఏర్పాటు చేసిన వస్తుప్రదర్శనశాల మైదానం వద్ద ఉండగా, అక్కడికి వచ్చిన ప్రత్యర్థులు కాపుగాచి ఈ దారుణానికి ఒడిగట్టారు. కారులో ఉన్న వెంకటేష్‌ను బయటకు లాగి మారణాయుధాలతో దాడి చేశారు. తల, చేయి, కాళ్ళతో పాటు శరీరంలోని వివిధ భాగాలలో బలమైన దెబ్బలు తగిలాయి. ఒక్కసారిగా వెంకటేష్ కిందపడిపోవడంతో దాడికి పాల్పడిన వారు అక్కడి నుంచి పరారీ అయ్యారు. విషయం తెలిసిన వెంటనే నజరబాద్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అప్పటికే వెంకటేష్ మృతి చెందినట్లు నిర్ధారించారు. నగర పోలీసు కమిషనర్ సీమాలాట్కర్, డీసీపీ బిందురాణి, సుందర్‌రాజ్ అక్కడికి చేరుకుని ప్రాథమికంగా పరిశీలించారు. హత్యకు పాల్పడిన వారు ఉపయోగించిన వాహనాల ప్రకారం గాలింపులు చర్యలకు ప్రత్యేక పోలీసు బృందాలను రంగంలోకి దించారు. ఇటీవల వరుణ పట్టణంలోని ఓహోటల్ ముందు ఉన్న రౌడీషీటర్ కార్తీక్‌ను హతమార్చిన వారే వెంకటేష్‌ను కూడా హత్యచేసి ఉంటారని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. కార్తీక్, వెంకటేష్‌లు ఆప్తులుగా కొనసాగారు. ఇరువురి వడ్డీ వ్యాపారంతో పాటు పలు వ్యవహారాలు చేసేవారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఐదు నెలల కిందట కార్తీక్‌ను హత్య చేశారు. అదే తరహాలోనే వెంకటేష్‌ను హతమార్చారు.

మనుషులను మింగిన నీరు

మూడు ప్రాంతాల్లో ప్రమాదాలు

ఆరుగురు మృతి.. నలుగురు గల్లంతు

సరదాగా నీటిలోకి దిగి.. ప్రమాదాల బారిన..

ఒకరిని కాపాడే ప్రయత్నంలో మరొకరు..



ఆరుగురు మృతి చెందిన మార్కోనహళ్ళి జలాశయం

బెంగళూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): తుమకూరు, విజయనగర జిల్లాల్లోని మూడు ప్రాంతాల్లో నీటమునిగి ఆరుగురు మృతి చెందారు. మరో నలుగురు గల్లంతయ్యారు. ఈ ఘోర ప్రమాదాలు మంగళవారం చోటు చేసుకున్నాయి. కుణిగల్ తాలూకాలోని మార్కోనహళ్ళి జలాశయం వెనుక జలాల్లో ఒకే కుటుంబానికి చెందినవారు నీట మునిగారు. తుమకూరులోని బీజీ పాళ్యకు చెందిన ఏడుగురు కుణిగల్ తాలూకా మాగడిపాళ్య గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లారు. భోజనం తర్వాత సరదాగా గడిపేందుకు జలాశయం వద్దకు వెళ్లారు. నీటిలో దిగి ఒకరు మునిగిపోతుండగా కాపాడేందుకు ఒకరి తరువాత ఒకరు వెళ్లారు. వీరిలో నవాజ్ అనే వ్యక్తి బయటకు సురక్షితంగా చేరుకున్నారు. తబస్సుమ్(45), షబానా(44), మిస్రా(4), మహిబ్(1) నీటిలో గల్లంతయ్యారు. సాజియా, అర్బిన్ అనే ఇద్దరి మృతదేహాలను సాయంత్రానికి వెలికి తీశారు. మిగిలిన నలుగురి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఇదే జిల్లా కొరటగెరె తాలూకా హర్షపుర గ్రామంలో ఫాంపాండ్‌లోకి దిగిన ఇద్దరు అక్క చెల్లెళ్లు ప్రమాదవశాత్తు మునిగి మృత్యువాతపడ్డారు. పశువులు మేపేందుకు వెళ్లిన ఇద్దరూ పొలంలో ఏర్పాటు చేసుకున్న నీటిగుంతలోకి పశువులను వదిలారు. ఎండ తీవ్రంగా ఉండటంతో కాళ్లు చేతులు కడుగుకునేందుని ఒకరు దిగారు. నీటిలో మునిగిపోతుండగా రక్షించే ప్రయత్నంలో గంగమ్మ(37), శకుంతలా(36) నీటిలో మునిగి మృతి చెందారు. కాసేపటి తర్వాత స్థానికులు గుర్తించేసరికే ఇద్దరు నీటిలో తేలియాడుతున్నారు. స్థానికులు గుర్తించి శవాలను బయటకు తీశారు. కొరటగెరె గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

తుంగభద్ర నీటిలో మునిగి అన్నదమ్ముల మృతి

బళ్లారి: గ్యార్మీ పండుగ చేసుకున్నారు. మరుసటి రోజు సరదాగా ఆ కుటుంబమంతా తుంగభద్ర డ్యాం బ్యాక్ వాటర్ వద్దకు వెళ్లారు. అక్కడ అందరూ కలిసి సరదాగా కాలం వెళ్లదీస్తున్నారు. అంతలో కాలయముడు ఆ కుటుంబానికి నీటి రూపంలో వచ్చాడు. తుంగభద్ర నదీతీరంలో నీటిని తెచ్చేందుకు వెళ్లిన అన్నదమ్ములు నీటమునిగి గల్లంతై శవాలుగా తేలారు. ఈ ఘటన విజయనగర జిల్లా మరియమ్మనహళ్లి వద్ద ఎంఎస్‌పీఎల్ క్రాస్ సమీపంలో తుంగభద్ర రిజర్వాయర్ బ్యాక్ వాటర్‌లో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు హొస్పేట్‌కు చెందిన రాజభక్షి(30) అతని సోదరుడు ఇమామ్(26) వారి తల్లిదండ్రులతో కలిసి ఏడుగురు కలిసి తుంగభద్ర డ్యాం బ్యాక్‌వాటర్ వద్ద సరదాగా గడపడానికి వెళ్లారు. ముందు రోజు వీరు గ్యార్మీ పండుగు చేసుకున్నారు. మరుసటి రోజు ఇల్లంతా సరదాగా బయటకు వెళ్లారు.



రాజభక్షి, ఇమామ్ (ఫైల్)

● తల్లిదండ్రులు బ్యాక్ వాటర్ నది ఒడ్డున కూర్చొని ఉన్నారు. అనదమ్ములిద్దరూ కలిసి నీరు తెచ్చేందుకు వెల్లారు. అక్కడ తమ్ముడు కాలుజారి నీటిలో కొట్టుకుపోతుండగా అతన్ని కాపాడేందుకు అన్న ప్రయత్నించాడు. ఈ ఘటనలో ఇద్దరూ నీటిలో మునిగి గల్లంతయ్యారు. కొన్ని గంటలకు అగ్నిమాపక దళం వచ్చి వీరిని బయటకు తీశారు. విహార యాత్రకు వెళ్లిన ఆ కుటుంబానికి విషాదమే మిగిలింది. రాజభక్షి బీదర్‌లోని ఒక ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నడు. తమ్ముడు ఇమామ్ బీటెక్ పూర్తి చేసి ఉద్యోగ వేటలో ఉన్నాడు. చేతికొచ్చిన ఇద్దరు కొడుకులు కళ్ల ముందే నీటిలో శవాలై తేలడంతో ఆ కుటుంబం కన్నీరుమున్నీరగా విలపించింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

వాల్మీకి సర్కిల్ అభివృద్ధికి కృషి

రూ.50లక్షల సొంత నిధులతో పనులు
లోకేశ్‌తో వాల్మీకి విగ్రహాన్ని ఆవిష్కరింపజేస్తాం
ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు



వాల్మీకి సర్కిల్‌లో వాల్మీకి చిత్రపటం వద్ద నినాదాలు చేస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): సొంత నిధులు రూ.50 లక్షలతో పట్టణంలోని వాల్మీకి సర్కిల్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు తెలిపారు. వాల్మీకి జయంతిని పురస్కరించుకుని ఎమ్మెల్యే ఆధ్వర్యంలో పట్టణంలోని వాల్మీకి సర్కిల్ వద్ద వాల్మీకి జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహర్షి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వాల్మీకి జయంతి వేడుకలను ప్రభుత్వం తరఫున నిర్వహించడం గర్వంగా ఉందన్నారు. వాల్మీకి సర్కిల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన వాల్మీకి విగ్రహాన్ని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా ఆవిష్కరింపజేస్తామన్నారు. వాల్మీకి సర్కిల్‌ను వాణిజ్య సముదాయంగా మార్చేందుకు కృషి చేస్తామన్నారు. అందరి సమన్వయంతో పట్టణాన్ని అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా మారుస్తామన్నారు.

దివ్యాంగులకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయండి

ప్రతి మండల కేంద్రంలోను దివ్యాంగులకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి, ఉచిత ఉపకరణాలను పంపిణీ చేయాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సూచించారు. పట్టణంలోని కరణం చిక్కప్ప ఉన్నత పాఠశాలలో దివ్యాంగ పిల్లలకు మంగళవారం ఉచితంగా ఉపకరణాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకుసదరం సర్టిఫికెట్లు, పింఛన్లు, పరికరాలు అందించి వారిని ఆదుకోవాలన్నారు. కాగా పట్టణంలోని వడ్డెకాలనీలో నిర్వహించిన తుమ్మల మారెమ్మ జాతరలో ఎమ్మెల్యే అమిలినేని కూటమి నాయకులతో కలిసి పాల్గొన్నారు.

నేటి నుంచి రెండో విడత పీజీ అడ్మిషన్లు

అనంతపురం రూరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో రెండో విడత పీజీ అడ్మిషన్ల ప్రక్రియ బుధవారం ప్రారంభం అవనున్నట్లు అడ్మిషన్ల సంచాలకుడు ప్రొఫెసర్ నరసింహన్ తెలిపారు. మొదటి విడత ప్రక్రియ గతనెల 27న ముగిసింది. తొలివిడతలో ఆర్ట్స్‌లో 56 మంది, సైన్స్‌లో 157 మంది, మొత్తం 213మంది విద్యార్థులు అడ్మిషన్ పొందారు. ఇప్పటికే ఏటా అడ్మిషన్లు తగ్గుతున్నాయన్న వాదనలు ఆయావర్గాల నుంచి వినిపిస్తున్నాయి. ఈనేపథ్యంలో రెండో విడత అడ్మిషన్ల ప్రక్రియపై ఆసక్తి నెలకొంది.

చీనీ టన్ను రూ.15 వేలు

అనంతపురం రూరల్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్ మంగళవారం సీజనల్ చీనీ కాయలు టన్ను గరిష్టంగా రూ.15వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఇన్‌చార్జ్ కార్యదర్శి, మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. కనిష్టంగా రూ.8వేలు, సరాసరి ధర రూ.12వేల పలికాయని వివరించారు. మార్కెట్‌కు మొత్తంగా 82 టన్నుల చీనీ కాయలు వచ్చాయని పేర్కొన్నారు.

టమోటా కిలో రూ.22

అనంతపురం రూరల్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో మంగళవారం టమోటాలు కిలో రూ.22తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా కనిష్ఠ ధర రూ.10, సరాసరి ధర రూ.17తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 2,250 టన్నుల టమోటాల వచ్చినట్లు పేర్కొన్నారు.



నిలిచిపోయిన అంగన్‌వాడీ కేంద్రం

నయాపైసా రాలేదు



మా ఊర్లో 136 ఇళ్లకు పునరావాసం కింద డబ్బులు వస్తాయని గ్రామానికి వచ్చిన రాజకీయ నాయకులు చెప్పడం తప్ప ఇంత వరకు నయాపైసా ఇచ్చింది లేదు. డబ్బులు రాకపోవడంతో చేసేది ఏమిలేక ఇళ్లు కట్టుకున్నాం. గ్రామంలో ఎక్కడా మౌలిక సదుపాయలు లేవు. ప్రభుత్వం నుంచి అభివృద్ధి పనులు రావడంలేదు.

-మోటసాని గంగమ్మ, ఉల్లికంటిపల్లి

ఎన్నేళ్లీ కన్నీళ్లు..!

'చాగల్లు' ముంపులో ఉల్లికంటిపల్లి

- నేటికీ అందని పునరావాస ప్యాకేజీ
- 13 ఏళ్లుగా నిరీక్షిస్తున్న గ్రామస్థులు

శింగనమల, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): పునరావాస సాయం కోసం మండలంలోని ఉల్లికంటిపల్లి ప్రజలు 13ఏళ్లుగా నిరీక్షిస్తున్నారు. ప్రభుత్వాలు మారినా తమ సమస్య పరిష్కారం కాలేదని గ్రామస్థులు వాపోతున్నారు. గ్రామ సమీపంలో చాగల్లు రిజర్వాయర్ నిర్మించడంతో ఊరు మొత్తం ముంపునకు గురవుతోంది. దీంతో ప్రజలు ఇళ్లు, పొలాలు కోల్పోయారు. అప్పటి ప్రభుత్వం పునరావాసం కింద గ్రామంలోని 150 కుటుంబాలకు నష్టపరిహారం అందజేసింది. పునరావాసం కింద 136 కుటుంబాలకు గ్రామానికి సమీపంలో 5 సెంట్లు చెప్పున ఇంటిస్థలాలు ఇచ్చారు. ఆర్ఆర్ చట్టం-2013 ప్రకారం రావాల్సిన ఇంటి నష్టపరిహారం, రోడ్డు, బడి, గుడి తదితర మౌలిక సదుపాయాలు ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో కల్పించలేదు. అయితే మండలంలో ఏ ఎన్నికలు వచ్చినా రాజకీయ నాయకులకు ఉల్లికంటిపల్లి సమస్య మాత్రం ప్రచారాస్త్రంగా మారుతోంది. ప్రాజెక్టు నిర్మాణ సమయంలో మాజీ ఎమ్మెల్యేలు సాకే శైలజానాథ్, యామినీబాల, జొన్నలగడ్డ పద్మావతి వరకు బాధితులకు హామీ ఇచ్చారు. నేటికీ పరిహారం మాత్రం ఇవ్వలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్లుగా ఉన్న తమ సమస్యకు కూటమి ప్రభుత్వమైనా పరిష్కారం చూపాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఇంటికి రూ.10 లక్షలు ఇవ్వాలి

పునరావాస ప్యాకేజీ కింద ఇంటికి రూ.7లక్షలు ఇస్తామని అప్పట్లో అధికారులు తెలిపారు. 136 ఇళ్లకు గ్రామంలో మౌలిక సదుపాయాల కోసం రూ.9.5 కోట్లు అంచనా వేశారు. అయితే ఇంతవరకు నయా పైస రాలేదని గ్రామస్థులు తెలిపారు. ప్రస్తుత ధరల ప్రకారం ఇంటికి రూ.10 లక్షలు ప్యాకేజీ ఇవ్వాలని కోరుతున్నారు. ప్యాకేజీ విషయం ప్రభుత్వం నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని అధికారులు చెబుతున్నారు.



సీసీ రోడ్డులేని ఉల్లికంటిపల్లి

సీఎం దృష్టికి తీసుకెళ్లా



ఉల్లికంటిపల్లి గ్రామానికి పునరావాస ప్యాకేజీ విషయంలో పలు సార్లు సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకు వెళ్లా. పునరావాసం ప్యాకేజీ వివరాలను ఇప్పటికే ఇచ్చాం. ఉల్లికంటిపల్లి గ్రామ ప్రజలకు సీఎం న్యాయం చేస్తాడనే నమ్మకం, భరోసా ఉన్నాయి.

-బండారు శ్రావణిశ్రీ, ఎమ్మెల్యే, శింగనమల

లోకేశ్ హామీతో...

మంత్రి నారా లోకేశ్ యువగళం పాదయాత్ర ఉల్లికంటిపల్లి గ్రామం మీదగా సాగినప్పుడు గ్రామస్థులు అందరు ఆయన్ను కలిసి పునరావాస ప్యాకేజీపై వినతి పత్రం ఇచ్చారు. దాదాపు అరగంటసేపు గ్రామస్థుల నుంచి వివరాలు సేకరించిన లోకేశ్ తాము అధికారంలోకి రాగానే పునరావాసం ప్యాకేజీ ఇస్తామని హామీ ఇచ్చారు. మంత్రి లోకేశ్‌పై తమకు నమ్మకం ఉందని, తమ సమస్య తప్పకుండా పరిష్కారం అవుతుందని వారు చెబుతున్నారు. ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబు సైతం వందశాతం ప్యాకేజీ ఇస్తామని హామీ ఇచ్చారని, తప్పకుండా నెరవేరుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



మంత్రి లోకేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉల్లికంటిపల్లి వాసులు (ఫైల్)

గుడి, బడికి స్థలం ఇవ్వలేదు



మా గ్రామనికి సంబంధించి కొండ ప్రాంతంలో 13ఏళ్ల కిందట ఒక్కో ఇంటికి ఐదు సెంట్లు స్థలాన్ని ఇచ్చారు. అయితే బడి, గుడికి మాత్రం స్థలం ఇవ్వలేదు. ఎలాగూ బడి లేదు. కనీసం గుడి కావాలని కొండలో మేమే చందాలు వేసుకుని అమ్మవారిని పెట్టి పూజలు చేస్తున్నాం.

-మైలా రవిశంకర్, ఉల్లికంటిపల్లి

ఐసీడీఎస్ పీడీ సస్పెన్షన్

- శిశుగృహలో శిశువు మరణాన్ని తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం

అనంతపురం వైద్యం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): శిశుగృహలో ఓ శిశువు మృతికి ఐసీడీఎస్ పీడీ ఎం.నాగమణిని బాధ్యులు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం వేటు వేసింది. మూడు నెలలపాటు సస్పెన్షన్ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఎవరినీ ఇన్‌చార్జ్ పీడీగా నియమించలేదు. సస్పెండ్ అయిన నాగమణి కార్యాలయంలోనే ఉండాలని, ఉన్నతాధికారుల ముందస్తు అనుమతిలేకుండా వెళ్లకూడదని కూడా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈనెల 3న విరేచనాల కారణంగానే శిశువు మృతిచెందినట్లు నివేదికలో చూపారని ఉత్తర్వుల్లో వివరించారు.

తరువాత ఎవరో..?


శిశువు మృతి కారణాలపై త్రిసభ్య సంఘం నుంచి మాతా, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్‌తో పాటు జిల్లా న్యాయసేవ అధికార సంస్థ వరకు ఎవరి స్థాయిలో వారు విచారణ నిర్వహించారు. పలుకోణాల్లో అధికారులు, సిబ్బందిని ప్రశ్నించారు. శిశుగృహ కేంద్రం మేనేజర్, ఆయాలు, సోషల్ వర్కర్, నర్స్, వాచ్‌మన్ నుంచి పర్యవేక్షణ అధికారులైన డీసీఎం, పీడీ వరకు ఆది, సోమవారాల్లో విడివిగా విచారించారు. అదేవిధంగా మంగళవారం జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ ప్రభుత్వ సర్వజన వైద్యశాలకెళ్లి పీడియాట్రిక్స్ విభాగం డాక్టర్లు, సూపరింటెండెంట్‌ను కలిసి శిశువు ఆరోగ్య వివరాలను సేకరించారు. శిశువు మృతిచెందకముందు అనారోగ్య కారణాలతో శిశుకేంద్రం నుంచి ఎన్నిసార్లు ఆస్పత్రికి తీసుకువచ్చారు. ఏఏ అనారోగ్య కారణాలతో శిశువు ఇబ్బందిపడ్డారు. మృతిచెందిన రోజు ఎలా ఉన్నారు వంటి సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రక్రియ ముగిసిన కొన్నిగంటలకే పీడీపై వేటు పడింది. అయితే ఇంకా ఎవరెవరిపై భవిష్యత్తులో వేటు పడనుందోనని చర్చ సాగుతోంది.



ఐసీడీఎస్ పీడీ నాగమణి

పశు వైద్యాధికారి పైసల వేట..!

- ప్రతి పనికీ కాసులిచ్చుకోవాల్సిందే
- ఆవేదన వ్యక్తం చేస్తున్న పాడి రైతులు



అనంతపురం రూరల్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ పశువైద్యాధికారి పైసలిస్తేనే పని చేస్తారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పశువులకు ఆరోగ్య పత్రం ఇవ్వాలన్నా.. చనిపోయిన వాటికి పోస్టుమార్టం చేయాలన్నా కాసులు ఇచ్చుకోవాల్సిందేనట. రైతులు మాట్లాడితే దురుసుగా వ్యవహరిస్తారని తెలుస్తోంది. ఆ శాఖలోని ఓ ఉన్నతాధికారి అండతోనే రెచ్చిపోతున్నట్లు చర్చ సాగుతోంది.

తేదీ వేసేందుకు రూ.వెయ్యి..

పాడి రైతుల సహాయార్థం కేంద్ర ప్రభుత్వం కిసాన్ క్రెడిట్ కార్డు అందిస్తోంది. ఆ కార్డు ఉన్న రైతులకు బ్యాంకుల్లో 4 శాతం వడ్డీతో రుణాలు ఇస్తారు. ఇందుకు పశువైద్యాధికారులు హెల్త్ సర్టిఫికెట్ (ఆరోగ్య పత్రం) ఇవ్వాల్సి ఉంటుంది. సర్టిఫికెట్‌లో పాడి పశువులకు ఉన్న ఇన్సూరెన్స్ ట్యాగ్‌ల ఆధారంగా ఏ జాతి ఆవు, వయసు, ఎన్ని లీటర్లు పాలు ఇస్తుంది, రంగు తదితర వివరాలను నమోదు చేయాల్సి ఉంటుంది. మండలంలోని పది గ్రామాలకుపైగా సదరు పశువైద్యాధికారి పరిధిలోకి వస్తాయి. ప్రతి సంతకానికి ఓ రేటు నిర్ణయించి వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. పాడి పశువుల సంఖ్యకు అనుగుణంగా రూ.వెయ్యి మొదలుకుని, రూ.5వేల వరకు వసూలు చేస్తున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల మండలంలోని ఓ గ్రామానికి చెందిన రైతు రుణం కోసం దరఖాస్తు చేసుకున్నాడు. రెండు వారాల కిందట ఆ రైతు నుంచి సదరు వైద్యాధికారి సర్టిఫికెట్ ఇచ్చేందుకు రూ.3,500 తీసుకున్నారట. ఆ సర్టిఫికెట్‌లో తేదీ లేదని బ్యాంకు అధికారులు చెప్పడంతో రైతు తిరిగి వైద్యాధికారి వద్దకెళ్లాడు. మార్పు చేసి ఇచ్చినందుకు మరో రూ.వెయ్యి పుచ్చుకున్నట్లు తెలుస్తోంది. పశువుల పోస్టుమార్టంలో కూడా వసూళ్లకు పాల్పడుతున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. పశువుల మందుల విషయంలో కూడా బయట కొనుగోలుకే ప్రాధాన్యం ఇస్తూ సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉద్యోగం సాధించిన అనతి కాలంలోనే ఈ అధికారి వసూళ్ల వేటలో పడినట్లు తెలుస్తోంది.

రైతులతో దురుసు ప్రవర్తన

పశువైద్యాధికారి వసూళ్ల వేటలోనే కాదు.. వ్యక్తిగతంగానూ దూకుడుగా వ్యవహరిస్తూ రైతుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ శాఖ ఉన్నతాధికారి అండతోనే చెలరేగిపోతున్నట్లు తెలుస్తోంది. రైతులు మాట్లాడితే.. 'ఉన్నతాధికారితో మాట్లాడతావా.. మీరు ఫోన్ చేస్తారా.. నన్ను చేయమంటారా..' అంటూ ఆస్పత్రికి వచ్చిన వారితో దురుసుగా మాట్లాడతారని రైతులు అంటున్నారు. ప్రస్తుతం కూడా మరో ఉన్నతాధికారి.. వసూళ్ల సారుకి వత్తాసు పలుకుతూ, వెనకేసుకొస్తున్నట్లు తెలుస్తోంది. ఈక్రమంలో ఆ అధికారి మరింత పేట్రేగిపోతున్నట్లు గ్రామాల్లో చర్చ సాగుతోంది. ఇటీవల జరిగిన మండల సర్వసభ్య సమావేశంలోనూ పలువురు ప్రజాప్రతినిధులు.. ఆ అధికారి తీరుపై ఫిర్యాదు చేశారు.

పంచాయతీ సిబ్బందికి నేటి నుంచి శిక్షణ

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో గ్రామ పంచాయతీల్లో ఆదాయ వనరులు సమకూర్చుకోవడంపై సిబ్బందికి బుధవారం నుంచి మూడు రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా పరిషత్ సీఈఓ శివశంకర్ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని ప్రతి మండలం నుంచి ఒక పంచాయతీ కార్యదర్శి చొప్పున మొత్తం 63 మంది హాజరు కావాలన్నారు. స్థానిక ఆర్డీటీ ఎకాలజీ సెంటర్‌లో కార్యక్రమానికి ఏర్పాట్లు చేశామని ఆయన వివరించారు.

అభివృద్ధికి సహకరించండి

అధికారులతో ఎమ్మెల్యేలు శ్రావణీశ్రీ, ఎమ్మెస్ రాజు

శింగనమల, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని అలంకరాయునిపేట అభివృద్ధికి మండల స్థాయి అధికారుల సహకారం అవసరమని ఎమ్మెల్యే బండారు శ్రావణీశ్రీ పేర్కొన్నారు. గ్రామంలో మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు ఇంటి వద్ద ఆయనతో కలిసి అభివృద్ధి పనులపై అధికారులతో బండారు శ్రావణీశ్రీ సమీక్షించారు. ఎమ్మెల్యే శ్రావణీశ్రీ మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు ఒక సామాన్యుడిగా వచ్చి నిధులు ఇవ్వమని జిల్లా కలెక్టర్, నియోజకవర్గ ఎమ్మెల్యేగా తనకు అర్జీ ఇచ్చినట్లు తెలిపారు. ఎమ్మెస్‌రాజు, మండల, జిల్లా అధికారుల సహకారంతో అలంకరాయనిపేటను మెడల్ విలేజ్‌గా తీర్చిదిద్దుతామన్నారు. అనంతరం ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు మాట్లాడుతూ మా గ్రామంలో దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే బండారు శ్రావణీశ్రీ సహకారంతో ముందుకెళ్తామన్నారు. ఇప్పటికే విడుదల చేసిన నిధులతో గ్రామంలో రోడ్లను అభివృద్ధి చేస్తామన్నారు. ఇంకా గ్రామంలో ఉన్న సమస్యలను గుర్తించి, మండల అధికారుల సహకారంతో పరిష్కరిస్తామన్నారు. అనంతరం గ్రామంలో ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు పర్యటించారు. రూ.60 లక్షల ప్రత్యేక నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు బుధవారం భూమి పూజ చేయనున్న నేపథ్యంలో ఆయా ప్రాంతాలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శేషారెడ్డి, ఎంపీడీఓ భాస్కర్, డిప్యూటీ ఎంపీడీఓ విజయ్‌కుమార్, డీఈ కృష్ణజ్యోతి, ఏఈలు రవీంద్రరెడ్డి, విజయ్‌కుమార్, నామాల శ్రీనివాసులు, ఎంఈఓ శివప్రసాద్, ఏపీఓ భాగ్యలక్ష్మి, దామోదర్, ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు బండారు శ్రావణిశ్రీ, ఎమ్మెస్ రాజు

అనంతలో రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడాపోటీలు

నవంబరు 7న ప్రారంభం.. ఏర్పాట్లు చేయండి: కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాలకు అనంత వేదిక కానుంది. జిల్లాలో నవంబరు 7, 8, 9 తేదీల్లో ఉత్సవాలు నిర్వహించనున్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఉత్సవాల నిర్వహణపై సంబంధిత అధికారులతో కలెక్టర్ ఆనంద్ సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడలు, సాంస్కృతిక ఉత్సవాలు నగరంలోని ఆర్డీటీ స్టేడియంలో నిర్వహిస్తామన్నారు. ఆయా శాఖల అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలన్నారు. పోటీల్లో పాల్గొనేందుకు వచ్చే ఉద్యోగుల కోసం అన్ని వసతులు కల్పించాలన్నారు. ఏపీ రెవెన్యూ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... రెవెన్యూ క్రీడల ప్రారంభోత్సవానికి రాష్ట్ర ఉన్నతాధికారులు వచ్చే అవకాశం ఉన్నందున పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలని కోరారు. సమావేశంలో డీఆర్వో మలోల, ఫారెస్ట్ సెటిల్మెంట్ ఆఫీసర్ రామకృష్ణారెడ్డి, ఏపీ రెవెన్యూ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట రాజేష్, ఆర్డీఓలు కేశవనాయుడు, వసంతబాబు, జీజీహెచ్ అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జునరెడ్డి, డీఎంహెచ్ఓ ఈబీ దేవి పాల్గొన్నారు.



సమావేశంలో బొప్పరాజు వెంకటేశ్వర్లుతో కలిసి మాట్లాడుతున్న కలెక్టర్

ఎన్నేళ్లో వేచిన ఉదయం

నేడు గ్రేడ్-5 కార్యదర్శులకు ఉద్యోగోన్నతుల కౌన్సెలింగ్

ఏళ్ల తరువాత ప్రమోషన్లపై హర్షం

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శులు ఏళ్లుగా ఉద్యోగోన్నతులకు నోచుకోలేదు. వారి గురించి పట్టించుకునే వారు లేరు. అలాంటివారి మోములో కూటమి ప్రభుత్వం ఆనందం నింపింది. ఉద్యోగోన్నతులు కల్పిస్తోంది. ఉమ్మడి జిల్లాలోని 155 మంది గ్రేడ్ 5 పంచాయతీ కార్యదర్శులకు గ్రేడ్ 4గా ఉద్యోగోన్నతి కల్పించనున్నారు. అందుకు సంబంధించిన కౌన్సెలింగ్ బుధవారం అనంతపురంలోని జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) కార్యాలయంలో చేపట్టనున్నారు. ఏళ్లుగా ఉద్యోగోన్నతులు కల్పించక తీవ్ర నిరాశలో ఉన్న పంచాయతీ కార్యదర్శులకు అవకాశం కల్పిస్తుండడంతో వారి ఆనందానికి అవధుల్లేవు.



డీపీఓ కార్యాలయం

అందరికీ ఆనందం

పంచాయతీ కార్యదర్శుల ప్రమోషన్ కలను కూటమి ప్రభుత్వం నెరవేరుస్తోంది. ఈ ఏడాదిలో వరుసగా ఉద్యోగోన్నతులు కల్పిస్తోంది. తొలుత 10 మంది సీనియర్ గ్రేడ్-1 కార్యదర్శులకు డిప్యూటీ ఎంపీడీఓలుగా ఉద్యోగోన్నతి కల్పించి, కమిషనర్ కార్యాలయానికి ఏసీఆర్ పంపారు. ఆ మేరకు స్థానిక అధికారులు ప్లేస్‌మెంట్స్ కేటాయించారు. దీంతో గ్రేడ్-2 కార్యదర్శులకు గ్రేడ్-1గా ఉద్యోగోన్నతి కల్పించడానికి మార్గం సుగమమైంది. డిప్యూటీ ఎంపీడీఓలుగా వెళ్లిన వారి స్థానాల్లో 10 మంది గ్రేడ్-2 కార్యదర్శులకు ఉద్యోగోన్నతి కల్పించారు. అప్పటికే ఖాళీగా ఉన్న వాటితోపాటు, ఉద్యోగోన్నతుల ద్వారా ఖాళీ అయిన వాటిని కలుపుకుని 44 మందికి గ్రేడ్-3 కార్యదర్శులకు గ్రేడ్-2గా ఉద్యోగోన్నతి కల్పించారు. గ్రేడ్-4 కార్యదర్శుల బాధలు అన్నీ ఇన్నీ కావు. పదేళ్లుగా ప్రమోషన్ లేక ఉద్యోగంపైనే పలువురిలో ఆసక్తి సన్నగిల్లింది. ఈ పరిస్థితుల్లో వారి ఉద్యోగోన్నతులకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆ మేరకు 46 మందికి గ్రేడ్-4 నుంచి గ్రేడ్-3 కార్యదర్శులుగా ప్రమోషన్ కల్పించారు. పంచాయతీ వ్యవస్థ నాలుగు గ్రేడ్స్ వరకే ఉండేది. గత వైసీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను అమలు చేయడంలో భాగంగా గ్రేడ్-5, గ్రేడ్-6 కార్యదర్శులను నియమించింది. దీంతో ఇప్పటికే గ్రేడ్-4 కార్యదర్శులకు సంబంధించి ఖాళీగా ఉన్న స్థానాలతోపాటు ప్రమోషన్ల ద్వారా ఖాళీ అయిన వాటిని కలుపుకుని ఏకంగా 155 మంది గ్రేడ్-5 కార్యదర్శులకు గ్రేడ్-4గా ఉద్యోగోన్నతి కల్పించనున్నారు. ఆ మేరకు జాబితా కూడా రూపొందించారు. బుధవారం ఉదయం 11 గంటలకు స్థానిక డీపీఓలో ఉమ్మడి జిల్లాలోని డీపీఓలు, డీఎల్‌పీఓలు కౌన్సెలింగ్ నిర్వహించి, ఉద్యోగోన్నతుల ప్రక్రియ చేపట్టనున్నారు. నెల రోజుల్లోపే గ్రేడ్-6 కార్యదర్శులకు గ్రేడ్-5గా ఉద్యోగోన్నతులు కల్పించనున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. సచివాలయ వ్యవస్థపై పలు అనుమానాలతో ఉన్న సిబ్బందికి సైతం ఉద్యోగోన్నతుల ప్రక్రియ చేపట్టడం ద్వారా భరోసా ఇచ్చినట్లయిందని ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గ్రేడ్-1 కార్యదర్శుల నుంచి డిప్యూటీ ఎంపీడీఓల ఉద్యోగోన్నతులకు సంబంధించి రేండో జాబితా దాదాపు 30 మందితో ఇప్పటికే సిద్ధం చేశారు. వారంలోపే వారికి కూడా ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది.

కొనేవారేరీ?

వారంలోనే పడిపోయిన ధర

ఆందోళనలో మొక్కజొన్న రైతులు



మార్కెట్ యార్డులో మొక్క జొన్న ధాన్యాన్ని ఆరబోసిన రైతులు

ఉరవకొండ, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): గిట్టుబాటు ధరలేక మొక్కజొన్న రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వారం రోజుల వ్యవధిలోనే ధరలు అమాంతం పడిపోయాయి. నాణ్యతలేదని పేచీ పెడుతుండటంతో వ్యాపారులు చెప్పిన రేటుకు అమ్ముకోవాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ఉరవకొండ డివిజన్‌లో 1326 హెక్టార్లలో మొక్క జొన్న సాగు చేశారు. ఉరవకొండలో 490, వజ్రకరూరులో 653, విడపనకల్లులో 185, గుంతకల్లులో 645హెక్టార్లలో మొక్కజొన్నను సాగు చేశారు. ప్రస్తుతం క్వింటా రూ.2వేలకు మించి ధర పలకడం లేదు. గత ఏడాది ఇదే సమయంలో క్వింటా రూ.2600కు పైగా ఉండేది. ఈ ఏడాది ఆరంభంలో కూడా ధర బాగానే ఉన్నా వారం రోజుల వ్యవధిలోనే పూర్తిగా తగ్గిపోయింది. పంట దిగుబడి ఆశాజనకంగా ఉన్నా కొనే వారు లేరని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు మొక్కజొన్న ధాన్యం తడిసి రంగు మారిందన్నారు. ఎకరాకు రూ.40వేల దాకా పెట్టుబడి పెట్టామని, క్వింటా రూ.2వేలు ధర ఉంటే పెట్టుబడి కూడా రాదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట బాగా పండితే ఎకరాకు 15 క్వింటాళ్లకు పైగా దిగుబడి వస్తుందని వారు తెలిపారు. ధరలు ఇలాగే కొనసాగితే నష్టము, అప్పులే మిగులుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, కనీస మద్దతు ధరను ప్రకటించాలన్నారు.

ఎదురు చూస్తున్నాం



పది రోజుల నుంచి మార్కెట్ యార్డులో మొక్కజొన్న గింజలను రాశులు పోసుకుని, కొనేవారి కోసం ఎదురు చూస్తున్నాం. నాలుగు ఎకరాల్లో మొక్క జొన్న పంటను సాగు చేశాం. ఇటీవల కురిసిన వర్షాలకు పంట తడిసి, దెబ్బతింది. వ్యాపారులకు అమ్ముదామనుకుంటే అడిగేవారు లేరు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి.

- రాజశేఖర్, రైతు, లత్తవరం

అడిగేవారు లేరు



వారం రోజులు వ్యవధిలోనే ధరలు పూర్తిగా పడిపోయాయి. అమ్ముకుందామంటే కొనేవారులేరు. మిర్చి పంట సాగు చేసి నష్టపోయామని, పంట మార్పిడి చేసి మొక్కజొన్న సాగు చేస్తే ఈ సారి నష్టలు తప్పడం లేదు. 2 ఎకరాల్లో పంటను సాగు చేశా. 30 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. కొనే వారి కోసం ఎదురుచూస్తున్నాం.

- ఎర్రిస్వామి, రైతు, ఉరవకొండ

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

అడివి బాపిరాజు (జయంతి)



బహుముఖ ప్రజ్ఞాశాలి అడివి బాపిరాజు 1895 అక్టోబరు 8న జన్మించారు. స్వాతంత్ర్య సమర యోధుడు, రచయిత, కళాకారుడు, నాటకకర్త. బాపిరాజు చిన్ననాటి నుంచి కవితలు రాసేవారు. ఆంధ్ర విశ్వకళాపరిషత్ అవార్డు లభించింది. తెలుగుదినపత్రిక మీజాన్ సంపాదకుడిగా, తర్వాత విజయవాడ ఆకాశవాణి రేడియోకేంద్రంలో సలహాదారుడిగా పనిచేశారు. నవ్యసాహిత్య పరిషత్ స్థాపకులలో ఒకరు. నవరంగ సంప్రదాయరీతిలో ఎన్నో చిత్రాలు గీశారు. సముద్రగుప్తుడు, తిక్కన పేరొందాయి. చిత్రకళను నేర్పడానికి గుంటూరులో ఒక ఫౌండేషన్ ఏర్పాటు చేశారు. తెలుగురాష్ట్రాలలో విస్తృతంగా ప్రచారంలో ఉన్న 'బావా బావా పన్నీరు' పాట బాపిరాజు వ్రాసిందే. 1952 సెప్టెంబరు 22న మరణించారు.

పేకేటి శివరామ్ (జయంతి)



ప్రముఖ హాస్య నటుడు 1918 అక్టోబరు 8న పశ్చిమగోదావరి జిల్లా పేకేరు గ్రామంలో జన్మించారు. 1945లో హెచ్ఎంవీ గ్రామ్ ఫోన్ రికార్డుసంస్థలో పనిచేసేవేళ ఘంటసాలతో లలితగీతాలు పాడించి ప్రైవేట్ రికార్డు చేశారు. భగవాన్ పేరిట 18 డిటెక్టివ్ నవలలు రాశారు. 1952లో శాంతి చిత్రంలో నటి సావిత్రి సరసన హాస్య నటుడిగా చిత్రరంగప్రవేశం చేశారు. 1953లో 'దేవదాసు'లో భగవాన్ పాత్రతో ప్రత్యేకగుర్తింపుసాధించారు. తెలుగు, తమిళ, కన్నడ చిత్రాల్లో హాస్యనటుడిగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా వందకుపైగా సినిమాలలో నటించారు. 1971లో కన్నడలో రూపొందించిన కులగౌరవం చిత్రం, తెలుగులో ఎన్టీఆర్‌తో 1972లో నిర్మించిన 'కుల గౌరవం' చిత్రానికి దర్శకుడు కావడం విశేషం. 2006 డిసెంబరు 30న చెన్నైలో కన్నుమూశారు.

సీఎస్ఆర్ ఆంజనేయులు (వర్ధంతి)



చిలకలపూడి సీతారామాంజనేయులు 1907 జూలై 11న నరసరావుపేటలో జన్మించారు. చిన్నప్పటి నుంచి నాటకాల పిచ్చి ఎక్కువగా ఉండేది. చదువుకు తగ్గ ఉద్యోగం వచ్చినా నాటకరంగాన్నే ఆయన ఉపాధిగా ఎంచుకున్నారు. రంగస్థలంపై కృష్ణుడిగా, శివుడిగా, రాముడిగా నటించడమే కాకుండా తన గాత్రమాధుర్యంతో ప్రేక్షకులను అలరించారు. రామదాసు, తుకారాం, సారంగధ వంటి ఎన్నో భిన్నమైన పాత్రలను నాటకరంగంపై అలవోకగా నటించి వాటికి జీవం పోశారు. ఆంగికం, వాచకం, అభినయం మూర్తీభవించిన వ్యక్తి సీఎస్ఆర్. ఐదున్నర దశాబ్దాలలో చలనచిత్ర సీమని అని తన అపూర్వ వైదుష్యంతో ప్రభావితం చేశారు. 1963 అక్టోబరు 8న చెన్నైలో కన్నుమూశారు.

'జీఎస్టీ ఫలాలు అందాలి'

హిందూపురం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): తగ్గిన జీఎస్టీ ప్రయోజనాలు ప్రతి ఒక్కరికి చేరాలని తహసీల్దార్ వెంకటేశ్ అన్నారు. మంగళవారం సూపర్‌జీఎస్టీ సూపర్‌సేవింగ్స్ నినాదాలతో తహసీల్దార్ కార్యాలయం నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడ రెవెన్యూ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ తగ్గిన జీఎస్టీని ప్రతి దుకాణంలో అమలు చేయాలన్నారు. తగ్గిన జీఎస్టీపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీటీలు మైనుద్దీన్, హరిత, మెప్మా అధికారి గంగులయ్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పెనుకొండ, (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బషీర్‌అహ్మద్ ఆధ్వర్యంలో విద్యార్థులకు జీఎస్టీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు శివన్న, జయప్రకాశ్ జీఎస్‌టీ పన్ను విధానాల గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఎస్ఎస్ మూర్తి, అల్లాబకష్, జయప్రకాశ్, సుధారాణి, ఎన్ఎస్ఎస్ పీఓలు శ్రీలేఖ, శివన్న, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త మృతికి నివాళులు

రొద్దం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యకర్త బోయ ముత్యాలప్ప మృతికి నాయకులు నివాళులు అర్పించారు. మంగళవారం నారనాగేపల్లిలో నివాళులు అర్పించిన అనంతరం ఆర్థిక సాయం అందించారు. ఆయన కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మాజీ సర్పంచ్ నాగభూషణం, మనోహర్, లింగప్ప, లోకేష్ తదితరులు నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు.

సమస్యను పరిష్కరిస్తాం: ఎంపీడీఓ

గుడిబండ, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని జమ్మలబండ పంచాయతీ బూదిపల్లి తండా గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని ఎంపీడీఓ కేశవరెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ మనునాయక్ తెలిపారు. మంగళవారం బూదిపల్లి తండా గ్రామవాసులు ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. స్పందించిన అధికారులు గ్రామాన్ని సందర్శించి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వీరి వెంట ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ హరి, డిప్యూటీ ఎంపీడీఓ నాగరాజునాయక్, పంచాయతీ కార్యదర్శులు ప్రకాశ్‌చక్రవర్తి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మృతి

పరిగి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): బెంగళూరులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ జనసేన కార్యకర్త రమేష్(33) మృతిచెందినట్లు ఏఎస్ఐ బాలరాజు తెలిపారు. ఈనెల 3న ఊటకూరు బసవనపల్లి సమీపంలో రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ప్రమాదంలో రమేష్‌కు తీవ్రగాయాలయ్యాయి. దీంతో చికిత్సనిమిత్తం బెంగళూరుకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. భార్య ఫిర్యాదు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తుమ్మల మారెమ్మకు ప్రత్యేక పూజలు

గుడిబండ, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గుడిబండలో వెలసిన తుమ్మలమారెమ్మ అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూలతో అలంకరించి విశేష పూజాకార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

కాంతార పేరుతో అగరబత్తి

బెంగళూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : తుళునాడు ప్రాంతంలోని ఆధ్యాత్మిక సంప్రదాయంకు అనుగుణంగా విడుదలైన కాంతార చాప్టర్-1 దేశవిదేశాలలో సంచలనం సృష్టిస్తోంది. కాంతార పేరుతోనే సైకిల్‌ప్యూర్ అగరబత్తిను మార్కెట్‌లోకి విడుదల చేసింది. రిషబ్‌శెట్టి దర్శకత్వంతో పాటు నటించిన కాంతార ముఖచిత్రంతోనే బ్రాండ్ విడుదల చేయడం సంతోషంగా ఉందని హొంబాళ గ్రూప్ కోఫౌండర్, ఎండీ చలువేగౌడ అభిప్రాయపడ్డారు. కాంతార సినిమా మన నమ్మకం, సంప్రదాయాలను విశ్వానికి చూపిందన్నారు. మన ఆధ్యాత్మిక మూలాలను పరిచయం చేసిందన్నారు. సైకిల్ ప్యూర్ ఎండీ అర్జున్‌రంగా మాట్లాడుతూ కాంతార కేవలం సినిమాగా మాత్రమే కాకుండా మన పురాతన సంప్రదాయల సంబరరం చేసుకునే శక్తిగా అవతరించిందన్నారు. కేఆర్ సిద్ధార్థ మాట్లాడుతూ కాంతార పేరుతో రెండు బ్రాండ్‌ల అగరబత్తిలు రావడం సంతోషంగా ఉందన్నారు.





రోడ్డుకు అడ్డంగా ఏర్పడిన గుంతకు అడ్డంగా ఉంచిన పూలకుండీ

సదాశివనగర్‌లో రోడ్డుమధ్యన గోతి

బెంగళూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): సదాశివనగర్ ప్రాంతమంటే నగరంలోనే అత్యంత కీలకమైనదిగా చెప్పవచ్చును. డీసీఎంతో పాటు ఆరేడుగురు కీలక మంత్రులు ఇక్కడే నివసిస్తుంటారు. అంతకంటే ముఖ్యంగా ఎఐసీసీ అధ్యక్షులు మల్లికార్జునఖర్గే నివాసం ఇక్కడే ఉంది. ఇలా ఖర్గేను కలిసేందుకు కాంగ్రెస్ ఢిల్లీ ప్రముఖులు వస్తుంటారు. అటువంటి కీలక ప్రాంతంలో రోడ్డు మధ్యన పెద్ద గుంత ఏర్పడింది. వారం పదిరోజులు ముగిసినా ఎటువంటి మరమ్మత్తులు చేయకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురికాకుండా ఉండేలా ఓ పెద్ద కూజా కలిగిన చెట్టును ఉంచారు. గుంతకు చెట్టు చాటుగా ఉన్నా మరెంతకాలం మరమ్మత్తులు చేయకుండా ఇలా వదిలేస్తారని స్థానికులు మండిపడుతున్నారు. సదాశివనగర్‌లోని ఆర్ఎంవీ రెండోస్టేజిలో ఏర్పడిన గుంతను వెంటనే పూడ్చాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

యుగయుగాలకు ఆదర్శం.. వాల్మీకి రామాయణం

● ఎంపీ కుమార్ నాయక్



విద్యార్థులను సన్మానిస్తున్న ఎంపీ, అధికారులు

రాయచూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): వాల్మీకి రచించిన రామాయణ మహా గ్రంథం అన్ని యుగాలకు ఆదర్శప్రాయమని, రాయచూరు ఎంపీ జి కుమార్ నాయక్ అన్నారు. మహర్శి వాల్మీకి జయంతిని మంగళవారం జిల్లా కేంద్రంలో అధికారికంగా అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి విగ్రహానికి స్థానిక పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం మహర్శి వాల్మీకి చిత్రపటం ఊరేగింపును అక్కడి నుంచి ఆశాపూర్ రోడ్డువద్ద ఉన్న వాల్మీకి భవనం వరకు కొనసాగించారు. అక్కడ నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడిన ఎంపీ, నేటితరం పాలకులు రామరాజ్యం స్థాపిస్థామని చెప్పడాన్ని బట్టి రామరాజ్యానికున్న విశిష్టత చెక్కుచెదరనది అన్నది మనందరికి స్పష్టమన్నారు. రామరాజ్యం నేటికి ఆదర్శప్రాయం అనుసరణీయమని ప్రతియొక్కరు ఆ మహనీయుడి పాలనను ఆచరించాల్సిందేనన్నారు. కాగా ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి కోసం వాల్మీకి అభివృద్ధి మండలి ఆధ్వర్యంలో ప్రభుత్వం చేపడుతున్న పలు కార్యక్రమాల గురించి ఈ సందర్భంగా ఎంపీ వివరించారు. నిధులను సద్వినియోగ చేసుకుంటు జిల్లాలో అన్ని గ్రామాల్లో కనీస సౌకర్యాల కల్పనకు అధికారులు మరింత నిబద్ధతతో పని చేయాలని సూచించారు.

వైభవంగా వాల్మీకి జయంతి

సిరుగుప్ప(ఆంధ్రజ్యోతి): మహర్షి వాల్మీకి జయంతిని మంగళవారం తాలూకా వ్యాప్తంగా వైభవంగా నిర్వహించారు. బీజేపీ సిరుగుప్ప కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే సిద్దలింగప్ప వాల్మీకి చిత్రపటానికి పూజలు నిర్వహించి నివాళి అర్పించారు. తాలుకా పరిపాలన, బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వాల్మీకి భావచిత్రపటంతో ఊరేగింపు చేశారు. అనంతరం వేదిక కార్యక్రమాన్ని కాంగ్రెస్ నాయకులు బీఎం సతీష్, తహసీల్దార్ గౌసియా బేగమ్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. జేడీఎస్ తాలుకా అధ్యక్షుడు శివనారాయణ ఆధ్వర్యంలో జేడీఎస్ పార్టీ కార్యాలయంలో వాల్మీకి చిత్రపటానికి పూజలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ తాలుకా అధ్యక్షుడు మల్లికార్జునస్వామి, కార్యదర్శి దేవలాపురం మారెప్ప, బసవరాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు అనిల్ నాయక్, హర్షనాయక్, వాల్మీకి సంఘం అధ్యక్షుడు నరసింహ నాయక, ఎస్టీ సంక్షేమ శాఖ డైరెక్టర్ నాగేంద్ర వర్మ, అసిస్టెంట్ అధికారి పరమేశప్ప, సమాజ సేవకులు అబ్దుల్ నబీ, వివిధ ప్రభుత్వ శాఖాధికారులు, కళాకారులు, బీజేపీ జిల్లా యువ అధ్యక్షులు ఎంఎస్ సిద్దప్ప ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ఆంజనేయులు ప్రొఫెసర్ వాల్మీకి జీవిత చరిత్రను వివరించారు.

గంగావతి రూరల్(ఆంధ్రజ్యోతి): నగరంలోని వాల్మీకి సర్కిల్ వద్ద మహర్షి వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. గంగావతి ఎమ్మెల్యే జనార్దన రెడ్డి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ వాల్మీకి రామాయణాన్ని రచియించిన ఆదికవి అన్నారు. ఆయన తత్వసిద్ధాంతాలు ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని సూచించారు. రాముడి పేరును ప్రపంచానికి చాటి చెప్పిన వ్యక్తి వాల్మీకి అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పరన్నమునవల్లి, మాజీ ఎమ్మెల్సీ శ్రీనాథ్, మాజీ మంత్రి మల్లికార్జుననాగప్ప, మాజీ ఎమ్మెల్యే బీరప్ప, సంగన్న, కొప్పళ బీజేపీ అధ్యక్షులు సింగనాళ విరూపాక్షప్ప, వాల్మీకి సమాజ ప్రముఖులు ,నారాయణప్ప, వీరభద్రప్ప, హనుమంతప్పనాయక్, కృష్ణప్ప. హనుమేశి పాల్గొన్నారు.



సిరిగుప్ప బీజేపీ కార్యాలయంలో వాల్మీకి జయంతి వేడుకలు



కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకుడు బీఎం సతీష్



రోగులకు ఇబ్బంది లేకుండా చూడాలి

● డిప్యూటీ డీఎంహెచ్ఓ

వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో డిప్యూటీ డీఎంహెచ్ఓ

హిందూపురం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో పనిచేస్తున్న వైద్యులు సమ్మెలో ఉన్నారని, అయినా ఆస్పత్రికి వచ్చే రోగులకు సేవలందించడంలో నిర్లక్ష్యం వహించకూడదని డిప్యూటీ డీఎంహెచ్ఓ మంజువాణి అన్నారు. మంగళవారం బసవనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో ఉన్న సిబ్బందికి సూచనలు, సలహాలు అందించారు. వైద్యులు సమ్మెలో ఉండటంతో సూపర్‌వైజర్లు ఔట్‌పేషెంట్ సిబ్బంది అందరూ విధుల్లో ఉంటూ ఎలాంటి అంతరాయం లేకుండా రోగులకు వైద్యం అందించాలన్నారు. ఏవైనా ఇబ్బంది ఎదురైతే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

లక్ష్యం దిశగా విద్యాభ్యాసం సాగాలి

అదనపు జిల్లా న్యాయాధికారి కంపల్లె శైలజ



షీల్డ్, మెడల్స్ అందుకున్న విద్యార్థులతో న్యాయాధికారి

హిందూపురం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి ఒకలక్ష్యాన్ని ఎంచుకుని ఆ దిశగా విద్యాభ్యాసం సాగించాలని అదనపు జిల్లా న్యాయాధికారి కంపల్లె శైలజ అన్నారు. మంగళవారం పట్టణంలోని రినోన్డ్ పాఠశాలలో ట్యాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు షీల్డ్, మెడల్స్ ప్రశంసాపత్రాలు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన న్యాయమూర్తి మాట్లాడుతూ విద్యార్థి దశ ఎంతో కీలకమైందన్నారు. మంచి నిర్ణయాలు తీసుకుని భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలన్నారు. పట్టుదల, క్రమశిక్షణతో విద్యాభ్యాసం సాగించి ఉత్తమ పౌరులుగా గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. తల్లిదండ్రులు, గురువులను గౌరవిస్తూ ఉన్నత లక్ష్యాలతో విద్యాభ్యాసం సాగించాలన్నారు. చదువుతోపాటు క్రమశిక్షణ చాలా అవసరమని అన్నారు. ప్రతి విద్యార్థి మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం ఆశయాలకు అనుగుణంగా చదువుకుని కలలు సహకారం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాది సంతోష్‌కుమారి, పాఠశాల నిర్వాహకులు ముస్తఫఅలీఖాన్, బీబీహాజిరా, సర్ఫరాజ్ అలీఖాన్, నజీమ తదితరులు పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ పురుషోత్తంరెడ్డి

చిలమత్తూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): గ్రామీణాభివృద్ధే లక్ష్యంగా జరగాల్సిన మండల సర్వసభ్య సమావేశం తూతూ మంత్రంగా సాగింది. వచ్చామా..వెళ్లామా అన్న రీతిలో సమావేశాలు నిర్వహించడం పాలకవర్గంతో పాటు అధికారులకు ఏడాది కాలంగా పరిపాటిగా మారింది. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో సమస్యలపై ఎలాంటి చర్చలు లేకుండానే సభను అరగంటలో ముగించేశారు. ఎంపీపీ పురుషోత్తంరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి కేవలం ఆరుగురు సభ్యులు మాత్రమే హాజరవడం విశేషం. మండల పరిషత్‌లో 15 మంది ప్రాదేశిక సభ్యులు ఉండగా, కేవలం ఆరుగురు మాత్రమే హాజరవడం చర్చనీయాంశమైంది. సమస్యలను అడిగేవారు లేకపోవడంతో సమావేశాన్ని తక్కువ సమయంలోనే ముగించేశారు.

మొక్కలను సంరక్షించండి: ఎంపీడీఓ



విద్యార్థులతో ఎంపీడీఓ తదితరులు

అమరాపురం, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మొక్కలను సంరక్షించాలని ఎంపీడీఓ రామారావు సూచించారు. మండల పరిధిలోని హేమావతి గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో భాగంగా మంగళవారం మొక్కలను నాటారు. సర్పంచ్ తిప్పేస్వామి, డిప్యూటీ ఎంపీడీఓ సుధాకర్, ఎస్సీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు జయకుమార్, గొల్లమారనపల్లి రామచంద్ర, హెచ్ఎం నాగభూషణ తదితరులు మొక్కలు నాటి నీరు పోశారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ ఒక్కో విద్యార్థి ఒక మొక్కను నాటి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ శివన్న, టెక్నికల్ అసిస్టెంట్ సుకుమార్, పంచాయతీ కార్యదర్శి నరేష్‌బాబు, మాజీ సర్పంచ్ కుమారస్వామి పాల్గొన్నారు.

సర్వే చేయించి హద్దులు చూపండి

యాదవ సంఘం నాయకులు



వినతిపత్రం ఇస్తున్న యాదవ సంఘ నాయకులు

సోమందేపల్లి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవాలయ నిర్మాణానికి సంబంధించి కేటాయించిన స్థలాన్ని సర్వేచేయించి హద్దులు నిర్ణయించాలని యాదవ సంఘం నాయకులు మంగళవారం ఇన్‌చార్జి తహసీల్దార్ మారుతికి వినతిపత్రం అందించారు. వేణుమాధవ యాదవ వెల్ఫేర్ సొసైటీ నాయకులు మహేష్, రాజగోపాల్, గోపాల్, రైతు సంఘం మండల అధ్యక్షులు హరిక్రిష్ణ మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి, కమ్యూనిటీ హాల్‌కోసం గతంలో తమకు 59 సెంట్లనుగాను నక్కలగుట్ట కాలనీలో పొజిషన్ ఇచ్చారన్నారు. సర్వేనంబరు 145-1ఎ, 2సిలో ఈ స్థలాన్ని ప్రభుత్వం 2017లో కేటాయించడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో స్థలానికి సంబంధించి సర్వేచేయించి హద్దులు చూపాలన్నారు.

సీజేఐపై దాడి యత్నం హేయం

నిరసనలో న్యాయవాదులు



హిందూపురంలో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

హిందూపురం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై ఓ న్యాయవాది బూటు విసిరిన ఘటనను నిరసిస్తూ హిందూపురంలో న్యాయవాదులు మంగళవారం విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ దేశ అత్యున్నత న్యాయస్థానంలో ప్రధాన న్యాయమూర్తిపై దాడికి పూనుకోవడం హేయమైన చర్య అన్నారు. ఇలాంటి వ్యక్తులపై కఠినంగా వ్యవహరించాలన్నారు. ప్రజలు దేవాలయంగా భావించే న్యాయస్థానంలో ఇలాంటి దాడులు జరగడం దురదృష్టకరమన్నారు. ఏదైనా ఉంటే న్యాయపరంగా చూడాలే తప్ప భౌతికదాడులకు దిగడం సబబుకాదన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు రామచంద్రారెడ్డి, నాగరాజారెడ్డి, రఘునాథరెడ్డి, నాగప్ప, రామిరెడ్డి, హిదాయతుల్లా, గోపాల్, రవి, బాబా పాల్గొన్నారు.

పెనుకొండ(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తిపై జరిగిన దాడి హేయమైనదని బహుజన చైతన్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు న్యాయవాది శివరామక్రిష్ణ అన్నారు. న్యాయమూర్తిపై జరిగిన దాడిని నిరసిస్తూ మంగళవారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌వద్ద రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దాడికి పాల్పడిన న్యాయవాదిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు బాబుప్రసాద్, ప్రధాన కార్యదర్శి రవికుమార్, రామాంజినప్ప, రామాంజినేయులు, ఎంఎస్ మూర్తి, ఆంద్రోస్, సురేష్, హనుమంతు, లక్ష్మణ్‌నాయక్, హంటర్ ప్రసాద్ తులసీరామ్ పాల్గొన్నారు.

'పథకాలపై అవగాహన కల్పించాలి'

గోరంట్ల అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి గ్రామ సభల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని హస్తకళల రాష్ట్ర డైరెక్టర్ సోమశేఖర్ అధికారులను కోరారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ క్రాప్ బుకింగ్ విషయంలో గ్రామాల్లో రైతులు సహకరించడం లేదని యూరియా వాడకాన్ని రైతులు తగ్గించాలని ఏఓ శంకర్‌నాయక్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కమలాబాయి పాల్గొన్నారు.

ఆక్రమణలకు పాల్పడితే చర్యలు

● సీఐ జనార్దన్

చిలమత్తూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): కోడూరు మన్రో తోపులో అధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తూ ఎవరు ఆక్రమణలకు పాల్పడినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ జనార్దన్ హెచ్చరించారు. మంగళవారం ఆంధ్రజ్యోతి దినపత్రిలో ప్రచురితమైన 'ఆగని ఆక్రమణలు' కథనం ప్రచురితమైంది. దీంతో ఎంపీడీఓ రమణమూర్తి, గ్రామ సర్పంచ్ మురళీమోహన్, పంచాయతీ కార్యదర్శి భాస్కర్ సీఐ జనార్దన్‌కి కబ్జాలకు పాల్పడుతున్న వారిపై ఫిర్యాదు చేశారు. ఆయన ఎస్ఐ మునీర్ అహమ్మద్‌తో కలిసి కోడూరు మన్రో తోపులో జరుగుతున్న ఆక్రమణలను పరిశీలించారు. అధికారుల ఆదేశాలను సైతం బేఖాతరు చేస్తూ కొందరు ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తున్నారని, అటువంటి వారిపై చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఈ సందర్భంగా సర్వేయర్‌తో మన్రో తోపునకు సరిహద్దులు గుర్తించి సరిహద్దుగా ట్రంచ్‌లు ఏర్పాటుచేసే పనులను ప్రారంభించారు. తోపులో ఉన్న ఆలయ ప్రాంగణంలో ఎవరు ఆక్రమణలు చేసినా వారిపై కేసులు నమోదు చేయాల్సి వస్తుందన్నారు.



ఆలయం చుట్టూ ఆక్రమణలకు తావులేకుండా ట్రెంచ్ తవ్విస్తున్న పంచాయతీ అధికారులు



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1626.06	1632.00
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	11,072	14,639
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	10,765	14,399
నీటి నిల్వ (టీఎంసీలు)	80.00	101.77

పాఠశాల సమయాల్లో మార్పు తగదు: ఏఐడీఎస్ఓ

బళ్లారి సిటీ, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సామాజిక విద్యాసర్వే కోసం ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల సమయాలను మార్చడం తగదని ఏఐడీఎస్ఓ నాయకులు అన్నారు. పాఠశాలలు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మార్చడం ఏమిటని ప్రభుత్వాన్ని వారు ప్రశ్నించారు. ఇది అత్యంత అప్రజాస్వామికమన్నారు. ఎయిడెడ్ పాఠశాలల పిల్లలకు నాణ్యమైన విద్యను అందించడంలో ఆటంకం కలిగిస్తుందన్నారు. ఉపాధ్యాయులు ఇప్పటికే బోధనతో పాటు బోధనేతర కార్యకలాపాలను కూడా నిర్వహించాల్సిన దుస్థితిలో ఉన్నారన్నారు. ఈ సర్వే బాధ్యత కూడా భారంగా మారిందని ఉపాధ్యాయుల నుండే వ్యతిరేకత వ్యక్తమవుతోందన్నారు. అంతేకాకుండా ఈ చర్య ప్రభుత్వ పాఠశాలల పిల్లల విద్యా స్థిరత్వాన్ని నాశనం చేస్తుందన్నారు. బోధనకు అదనంగా మారడంతో పనికి అదురుకాకుండా ఉండటానికి ఎటువంటి ప్రణాళిక లేదా లేకుండా పాఠశాలల సమయాలను మార్చడం దురదృష్టకరమన్నారు. పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ పాఠశాలల సమయాన్ని సర్వే పనుల కోసం త్యాగం చేయకుండా ప్రభుత్వం ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని ఏఐడీఎస్ఓ జిల్లా కమిటీ నాయకులు డిమాండ్ చేశారు.

కేఆర్ఎస్ పార్టీ సభ్యత్వం తీసుకోండి

● జిల్లాప్రధాన కార్యదర్శి ప్రకాశ్



మాట్లాడుతున్న జిల్లాప్రధాన కార్యదర్శి ప్రకాశ్

బళ్లారి సిటీ, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్ర సమితి (కేఆర్ఎస్)లో సభ్యత్వం తీసుకోవాలని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని పత్రికాభవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీని మరింత బలోపేతం చేయడానికి సభ్యత్వ నమోదు ప్రచారాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ప్రచారాన్ని కన్నడ పోరాటదారుడు గోవింద్ బెంగళూరులో అక్టోబర్ 6న ప్రారంభించారన్నారు. రాష్ట్ర కార్యదర్శులు రఘు, ఉపాధ్యక్షులు మంజునాథ్, సోమసుందర్ నేతృత్వంలో మూడు బృందాలు 16వ తేదీ వరకు అన్ని జిల్లాల్లో పర్యటించి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు. బళ్లారిలో బుధవారం ఉదయం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, మంజునాథ్, నాయకులు యూసుఫ్, మహమ్మద్ అనీఫ్, జనార్దన, గోనాల్ రవి, శ్రీనివాస పాల్గొన్నారు.

వేరుశనగకు ఆకుపచ్చ తెగుళ్లు

● ఆందోళనలో అన్నదాతలు



తెగుళ్ల ప్రభావంతో ఎదుగుదలలేని వేరుశనగ పంట

కంప్లి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): కంప్లి, కురుగోడు తాలూకా పరిధిలోని దేవసముద్రం కణివి తిమ్మలాపురం బైలూరు, సింధిగేరి గ్రామాల్లో పేసిన వేరుశనగ పంటకు ఆకుపచ్చ తెగుళ్లు సోకాయి. ఈ తెగుళ్లతో పంట ఎదుగుదల పూర్తిగా తగ్గిపోయింది. తరచూగా వర్షాలు పడటం, ప్రస్తుతం ఎండ ఎక్కువగా ఉండటంతో వాతావరణంలో మార్పుల వల్ల పంటపై వైరస్ ప్రభావం ఎక్కువైంది. పంటలకు వైరస్ సోకడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతు నాగరాజు, బసవరాజు, రమేష్ మాట్లాడుతూ పంటలు ఈసారి తెగుళ్ల ప్రభావంతో పూర్తిగా నష్టపోయామని వాపోయారు. వెంటనే రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టి రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.



కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భరత్‌రెడ్డి, నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

రూ.1.1 కోట్లతో వాల్మీకి విగ్రహం ఏర్పాటు చేస్తాం

● ఎమ్మెల్యే భరత్‌రెడ్డి

బళ్లారి గాంధీనగర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎస్పీ సర్కిల్‌లో రూ. 1.10 కోట్లతో మహర్షి వాల్మీకి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి అన్నారు. జిల్లా పంచాయతీ, నగరపాలికె, షెడ్యూల్ కులాల సంక్షేమ శాఖ, జిల్లా యంత్రాంగం సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని నల్లచెరువు వద్దనున్న వాల్మీకి భవనంలో మంగళవారం వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే, జిల్లా అధికార యంత్రాంగం, కార్పొరేటర్లు, వాల్మీకి సంఘం నాయకులు కలిసి జ్యోతిని వెలిగించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వాల్మీకి రచించిన రామాయణ గ్రంథాన్ని ప్రతి ఒక్కరూ చదవాలన్నారు. డాక్టర్ జగ్జీవన్‌రామ్ తేలు పరిశ్రమల అభివృద్ధి సంస్థ చైర్మన్ ముండరిగి నాగరాజ్ మాట్లాడుతూ వాల్మీకి రామాయణంలో 24 వేలకు పైగా శ్లోకాలు ఉన్నాయన్నారు. మేయర్ ముల్లంగి నందీష్‌బాబు మాట్లాడు తూ రామాయణంలోని అనేక అంశాలు మనజీవితాన్ని ప్రభావితం చేస్తాయన్నారు. కలెక్టర్ కె. నాగేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి మనిషి ఒకరిని ఒక రు గౌరవించుకోవాలన్నారు. అంతక ముందు వాల్మీకి చిత్రపటాన్ని ట్రాక్టర్‌పై ఉంచి నగర వీధుల్లో ఊరేగించారు. ఊరేగింపులో వేలాది మంది వాల్మీకులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి



ర్యాలీ చేస్తున్న వాల్మీకి సంఘం నాయకులు

బళ్లారిరూరల్ (ఆంధ్రజ్యోతి): నగరంలో వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో మంగళవారం వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. గాంధీనగర్ ఎస్పీ కాంప్లెక్స్ అఖండ కర్ణాటక వాల్మీకి కార్యాలయం నుంచి రాజ్యాధ్యక్షుడు జోళదరాశి తిమ్మప్ప, ఉపాధ్యక్షుడు జనార్ధన్ నాయక్, జిల్లా అధ్యక్షుడు ముద్దమల్లయ్య, సత్యనారాయణ, దుర్గన్న ఆధ్వర్యంలో భారీ ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు. దుర్గమ్మ గుడి, రాయల్ సర్కిల్, బ్రూస్‌పేట్ సర్కిల్ బెంగళూరు రోడ్డు, మోతీ సర్కిల్ మీదుగా ఎస్పీ సర్కిల్ వాల్మీకి మహర్షి విగ్రహం వద్దకు చేరుకున్నారు. వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. రూపనగుడి గోవిందు, వెంకటేష్, ధనుంజయ, నాగరాజు, దుర్గన్న కాయిపల్లి బసవరాజు, అడ్వకేట్ జయరాం, రుద్రప్ప గూడూరు జయరాం, ఎర్రగుడి రమేష్, ఎర్రగుడి రాజా కృష్ణమూర్తి పాల్గొన్నారు.



కంప్లిలో ఆకట్టుకుంటున్న రామలక్ష్మణ, ఆంజనేయుడి వేషధారులు

కంప్లి(ఆంధ్రజ్యోతి): కంప్లి, కురుగోడు, సిరిగేరి కుడితిని పట్టణంలో వాల్మీకి జయంతి వైభవంగా నిర్వహించారు. కంప్లి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మంజునాథ్ నాయక్ మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ వాల్మీకిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఉద్భవ గణపతి ఆలయం నుంచి వాల్మీకి భవనం వరకు మహిళల కలశాలతో ఊరేగింపు చేపట్టారు. రామలక్ష్మణ ఆంజనేయ శూర్పణక వేషధారణలతో ఆకట్టుకున్నారు. సిరిగేరి గ్రామంలో వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. డొల్లు కణితలతో చిన్నారుల నృత్యం అబ్బురపరిచింది.

రిగ్గింగ్‌తో అధికారంలోకి వచ్చిన బీజేపీ: ఎమ్మెల్యే

బళ్లారి సిటీ(ఆంధ్రజ్యోతి): ఓట్ల రిగ్గింగ్ వల్లే బీజేపీ వరుసగా మూడు పర్యాయాలు కేంద్రంలో అధికారంలోకి వచ్చిందని నగర ఎమ్మెల్యే భరత్ రెడ్డి ఆరోపించారు. మంగళవారం నగరంలోని రాయల్ సర్కిల్లో బీజేపీ ఓట్ల రిగ్గింగ్‌కు వ్యతిరేకంగా జరిగిన సంతకాల సేకరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో లేదా కేంద్రంలో బీజేపీ ఎప్పుడూ మెజారిటీతో అధికారంలోకి రాలేదని, నిజాయితీగా ఎన్నికల ద్వారా కాకుండా మోసపూరితంగా గెలిచిందన్నారు. బెంగళూరులోని మహదేవపురలో ఒకే డోర్ నంబర్ కింద 80మందికిపైగా ఓటర్లు నమోదు చేసుకున్నారని, దీనిని కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు రాహుల్ గాంధీ వెలుగులోకి తెచ్చి ఆధారాలతో సహ నిరూపించారన్నారు. దీనిని మీడియా దర్యాప్తు చేసినప్పుడు అది నిజమని తేలిందన్నారు. కానీ బీజేపీ ప్రభుత్వం దానిని అంగీకరించడానికి సిద్ధంగా లేదన్నారు. నేడు దేశవ్యాప్తంగా ఓటర్ల మోసానికి వ్యతిరేకంగా ఓటర్లలో అవగాహన కల్పించడానికి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లం ప్రశాంత్, ముల్లంగి నందీశ్, ముండరగి నాగరాజు, బోయపాటి విష్ణు, హుమాయూన్‌ఖాన్, బసప్ప, బెణకల్లు బసవరాజు, వరకుం, ముదిమల్లయ్య, తిమ్మప్ప, అల్లాబకష్, మానయ్య, కార్పొరేషన్ సభ్యులు రాజేశ్వరి, హొన్నప్ప, బూత్‌స్థాయి అధ్యక్షులు, జిల్లా స్థాయి ఆఫీస్ బేరర్లు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి

మార్కుల జాబితాపై స్వామీజీ ఫొటో

● వీఎస్కేయూలో వెలుగులోకి..

బళ్లారి గాంధీనగర్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఓ విద్యార్థి మార్కుల జాబితాలో అతని ఫొటోకు బదులుగా స్వామీజీ ఫొటో ప్రింట్ కావడంతో ఆ విద్యార్థి ఖంగుతిన్నాడు. నగరంలోని విజయనగర శ్రీ కృష్ణదేవరాయల విశ్వవిద్యాలయం పరిధిలోకి వచ్చే కొప్పళలోని గవిసిద్ధేశ్వర కళా, వాణిజ్య, విజ్ఞాన విభాగంలో చదువుతున్న దేవరాజ్ ముళిమణి అనే విద్యార్థికి వింత సమస్య ఎదురైంది. 4వ సెమిస్టర్‌కు చెందిన మార్కుల జాబితాను విద్యార్థి ఆన్‌లైన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోగా మార్కుల జాబితాపై తన ఫొటోకు బదులుగా స్వామీజీ ఫొటో ఉండడం చూసి ఆవాక్కయ్యాడు. జరిగిన తప్పును సరిదిద్దివ్వాలని విద్యార్థి వీఎస్కేయూకు విన్నవించాడు. దీనిపై వీఎస్కేయూ అధికారులు మాత్రం ఇందులో తమ తప్పు లేదని, యూయూసీఎంఎస్ పోర్టల్‌లో విద్యార్థులకు చెందిన సమాచారం అప్‌లోడ్ చేసే సమయంలో విద్యార్థులు తమ ఫొటోకు బదులుగా స్వామీజీ ఫొటో అప్‌లోడ్ చేసి ఉండవచ్చని అంటున్నారు. విద్యార్థులు అప్‌లోడ్ చేసిన సమాచారం పరిశీలన చేయడానికి రాదని, విద్యార్థులు పోర్టల్‌లో అప్‌లోడ్ చేసిన వివరాల ఆధారంగా మార్కుల జాబితా ప్రింట్ అవుతుందని అంటున్నారు. ఇలాంటివి తరచూ జరుగుతుంటాయని, విద్యార్థులు ఖంగారు పడాల్సిన అవసరం లేదని, మార్కుల జాబితాలో జరిగిన తప్పును సరిదిద్దాలని కోరుతూ విశ్వవిద్యాలయానికి అవసరమైన సమాచారాన్ని తిరిగి యూసీఎంఎస్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచిస్తున్నారు.


STATEMENT OF MARKS

మార్కుల జాబితాలో స్వామీజీ ఫొటో

ఉత్సాహంగా శరణ్య భరతనాట్య అరంగేట్రం

బెంగళూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): నగరంలో పేరొందిన రచన డాన్స్ అకాడమీకి చెందిన నృత్య గురు విదూషీ కావ్య దిలీప్ వద్ద నేర్చుకున్న శరణ్య భరతనాట్య రంగప్రవేశం ఉత్సాహంగా సాగింది. మల్లేశ్వరం సేవాసదన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో శరణ్య రంగ ప్రవేశం చేశారు. రచన డాన్స్ అకాడమీ పూర్వ డ్యాన్సర్లతో పాటు ప్రస్తుతం శిక్షణ పొందుతున్న వారు, నగరంలోని ప్రముఖ సంగీత గురువులు, అభిమానులు కార్యక్రమంలో పాల్గొన్నారు. శరణ్య తల్లిదండ్రులు బినారాయణ, గాయత్రీలతో పాటు బంధుమిత్రులు పాల్గొన్నారు. మృదంగం-జీఎస్ నాగరాజు, కొళలు-సుందరకుమార్, వీణ-ప్రశాంత్‌కుమార్ సంగీతం సమకూర్చారు. శరణ్య భరతనాట్య పరీక్షల్లో జూనియర్, సీనియర్ విద్వత్ పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యారు. ముంబైలో జరిగే నేషనల్ పూర్వ భరతనాట్య పరీక్షలోను ఉత్తీర్ణత సాధించినట్టు గురువు కావ్య దిలీప్ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యులుగా బెంగళూరు యూనివర్సిటీ ఆర్ట్స్ విభాగం డైరెక్టర్ దీపికా, డాక్టర్ రష్మికా ప్రసాద్, లలితశ్రీ, సుమూర్తికుమార్ పాల్గొన్నారు. రాష్ట్రంలోని వివిధ ఆలయాలలో జరిగిన ప్రత్యేక సంగీత కార్యక్రమాలలో శరణ్య ప్రదర్శనలిచ్చినట్టు తెలిపారు.



నృత్య భంగిమలో శరణ్య



శరణ్యకు సర్టిఫికెట్ ప్రదానం చేస్తున్న అకాడమీ గురువు

తలనొప్పిగా మారిన యూహెచ్ఐడీ సర్వే

● ఇబ్బంది పడుతున్న ఉపాధ్యాయులు



అపార్ట్‌మెంట్‌లో అతికించిన స్టిక్కర్లను పరిశీలిస్తున్న అధికారులు

బళ్లారి సిటీ, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): సర్వే యూహెచ్ఐడీ రద్దు కలనొప్పిగా మారిందని ఉపాధ్యాయులు అంటున్నారు. రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల శాశ్వత కమిషన్ నిర్వహించిన సామాజిక, విద్యా ఆర్థిక సర్వే వివరి రోజుకు చేరుకుంది. జిల్లాలో 89.11 శాతం సాధించింది. అయితే ఆ వనరుమైన ప్రదేశాలకు జారీ చేసిన యూహెచ్ఐడీల సాధనకు ప్రభావితం చేశాయి. వాటి రద్దు తలనొప్పిగా మారింది. జిల్లాలో 3,85,908 గృహాలను సర్వే కోసం గుర్తించారు. వీటికి ప్రత్యేకమైన యూహెచ్ఐడీ (యూనిక్ హౌస్ హోల్డ్ ఐడెంటిఫికేషన్ నంబర్లు) ఇచ్చారు. ఈ పనిని గుల్బర్గా విద్యుత్ సరఫరా కంపెనీ లిమిటెడ్(జెస్కాం) చేసింది. కొన్ని వాణిజ్య దుకాణాలు, శిథిలావస్థలో ఉన్న, ఖాళీగా ఉన్న ఇళ్లు, అపార్ట్‌మెంట్లలోని ఖాళీ ప్లాట్లకు కూడా యూహెచ్ఐడీ కార్డులను అతికించారు. చాలా చోట్ల అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, ఆలయాలకు కూడా అతికించినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఇది సమస్యగా మారింది.

రోడ్డుపై గుంతలను పూడ్చిన పోలీసు



గుంతల్లో మట్టి వేస్తున్న పోలీసు మహ్మద్ అలీ

రాయచూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని లింగసుగూరు తాలూకా మేదినాపూర్ నుంచి హట్టికి వెళ్లే దారిలో పెద్ద ఎత్తున పడిన గుంతలను హట్టి పోలీస్ స్టేషన్‌కు చెందిన అధికారి మహ్మద్ అలి సొంత ఖర్చుతో పూడ్చి వేయడం సర్వత్ర చర్చనీయాంశమైంది. మహ్మద్ అలి కుమారుడు శాహిద్ ఇటీవల ఆ రోడ్డు గుండా ప్రయాణిస్తూ ప్రమాదానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతుండడం గమనార్హం. తన కుమారుడికి జరిగిన ప్రమాదం ఇంకెవ్వరికి జరగరాదన్న ఉద్దేశంతో సొంత ఖర్చుతో మంగళవారం రోడ్డులోని గుంతలను పూడ్చివేస్తూ అందరి దృష్టిని ఆకర్షించారు.

హోలబావిలో అగ్ని ప్రమాదం



కాలిపోయిన వస్తువులను చూపుతున్న హనుమవ్వ

రాయచూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని లింగసుగూరు తాలూకా హోలబావి గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు పూర్తిగా కాలిపోయింది. ప్రమాదంలో లక్ష విలువైన వస్తువులు కాలిపోగా, అదృష్టవశాత్తు ఇంటి యజమాని ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. ఎప్పటిలాగే రాత్రి ఇంటి బయట నిద్రిస్తున్న హనుమవ్వ అర్ధరాత్రి దాటిన తరువాత ఇంట్లో మంటలు చెలరేగినట్టు గుర్తించి కేకలు వేయడంతో ఇరుగు-పొరుగు వారు వచ్చి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడికొచ్చిన సిబ్బంది స్థానికుల సహాయంతో మంటలను ఆదుపుచేశారు. అప్పటికే ఇంట్లో ఉన్న రూ.50వేలకు పైగా నగదు 20 తులాల బంగారం విలువైన వస్తువులు, బియ్యం ఇతరత్రా వస్తువులు కాలిపోయాయి. కాగా ప్రమాదం జరిగిన విషయం తెలిసినా ఇప్పటి వరకు రెవెన్యూ, పంచాయతీ రాజ్, స్థానిక అధికారులు గ్రామానికి వచ్చి బాధితురాలిని పరామర్శించింది లేదని ఆస్తి నష్టం అంచనా వేసింది లేదని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రమాదం సోమవారం రాత్రి జరిగగా మంగళవారం సాయంత్రం వరకు అధికారులు ఆ ప్రాంతానికి రాలేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జేడీఎస్ నగర అధ్యక్షుడిపై కేసు

రాయచూరు, అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): నగరంలోని దళితవాడకు చెందిన దశవంత్(20) అనే యువకుడి హత్యారు సంబంధించి మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జనతాదళ్(ఎస్) టీతిమ్మారెడ్డితో పాటు మరో 8 మందిపై మార్కెట్ యార్డు పోలీసులు కేసు నమోదు చేశారు. గత నెల 27న ఎల్‌బీఎస్ నగరంలోని తిమ్మారెడ్డి లేబౌట్ సమీపంలో దశవంత్ అనే యువకుడిని తిమ్మారెడ్డి మద్దతుదారులు కులం పేరుతో దూషించడమేగాక దాడిచేశారు. దాడిలో దశవంత్ తీవ్ర గాయాలకుగా ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ చికిత్సపొందుతూ మృతి చెందాడు. మృతుడి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మార్కెట్ యార్డ్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేసి 8 మంది నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

కారు బోల్తా.. ఇద్దరి మృతి



పొలంలో బోల్తాపడిన కారు

రాయచూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని హుణసిహాళ హుడా గ్రామ శివారుల్లో కారు బోల్తాపడిన ఘటనలో ఇద్దరు మృతిచెందారు. మంగళవారం నగర సమీపంలోని ఆస్కిహాళ నుంచి కల్లూరుకు కారులో నలుగురు వ్యక్తులు వెళుతుండగా హుణసిహాళహుడా గ్రామం వద్ద రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టి సమీపంలోని పొలంలో బోల్తాపడింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు ఆస్కిహాళ్ గ్రామస్తులు అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మృతిచెందిన, గాయపడిన వారి వివరాలు తెలియాల్సి ఉంది. విషయం తెలుసుకున్న రూరల్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

ఘనంగా మహర్షి వాల్మీకి జయంతి



వాల్మీకి చిత్రపటం ఊరేగింపులో అధికారులు

రాయచూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. మహర్షి వాల్మీకి చిత్రపటాన్ని నగరంలోని ప్రముఖ వీధుల గుండా ఊరేగించారు. ఊరేగింపులో ఎంపీ జీ కుమార్ నాయక్, సిటీ ఎమ్మెల్యే డాక్టర్ శివరాజ్ పాటిల్, మహానగర పాలికె అధ్యక్షురాలు నరసమ్మ, డీసీ నితీశ్, మహానగర పాలిక కమిషనర్ జుబిన మొహాపాత్ర తదితరులు వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లా యంత్రాంగం, మహానగర పాలిక, జడ్పీ తదితర శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సమాజ ప్రముఖులు, జిల్లా ప్రముఖులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

మురుగునీటిలోనే జన సంచారం

హోసూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): హోసూరు బాగలూరు రోడ్డు లో 20 అడుగుల ఎత్తైన ఆంజనేయస్వామి శిల, అలాగే ఎదురుగా పురాతనమైన కృష్ణుడి ఆలయం ఉంది, తాలూకా కార్యాలయం నుంచి బాగలూరు రోడ్డు వరకు మురుగునీటి కాలువ సరిగ్గా నిర్మించక పోవడంతో వర్షపు నీరు మురుగునీరు కలిసి ప్రవహిస్తోంది, నగరంలో ఈ రోడ్డును ఉపయోగించని వారు లేరని చెప్పవచ్చు. తాలూకా కార్యాలయం , మహిళా పోలీస్‌స్టేషన్, టౌన్ పోలీస్ స్టేషన్, రైతు బజార్, బజార్‌లు, రైల్వే స్టేషన్, బస్ స్టేషన్ కు వెళ్ళే వాళ్ళే వారు ఈ రోడ్డునే ఉపయోగించాలి, ఇంకా గ్రామీణ ప్రాంతాల ప్రజలు తమ వ్యవసాయానికి అవసరమైన వస్తువులు, తమ ఇంటికి అవసరమైన కిరాణా సామగ్రి మొదలైనవి కొనుగోలు చేసేందుకు కూడా ఈ రోడ్డునే ఉపయోగించాలి, అయితే ఈ రోడ్డులో కాలువ లేక పోవడంతో మురుగునీరు, కాలువ నీరు మొత్తం రోడ్డుపైనే ప్రవహిస్తోంది, దీని వల్ల ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు, దీనివల్ల మరింత కాలుష్యం ఏర్పడుతూంది, ప్రజలు నడుచుకుంటూ వెళ్లడానికి నానా తిప్పలు పడుతున్నారు. దీనికి ఒక పరిష్కారం కావాలని ప్రజలు కోరుతున్నారు.



మురుగునీటితో ఇబ్బందిపడుతున్న వాహనదారులు

ప్రత్యంగిరాదేవికి పౌర్ణమి పూజలు

హోసూరు, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి) : హోసూరులో పౌర్ణమి సందర్భంగా దేవి అమ్మవారును విశేషంగా పూజించారు. అందులో ముఖ్యంగా ప్రత్యంగిరాదేవి అమ్మవారికి ఎండుమిరపతో విశేషంగా హోమాలు నిర్వహిస్తారు. హోసూరు మోర్నపల్లి ప్రాంతంలో శ్రీ ప్రత్యంగిరా దేవి అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేసి వివిధ పూజలు నిర్వహించారు. దుష్టశక్తులను తొలగించి, ప్రజల శ్రేయస్సును కోరి హోమాలు, యజ్ఞాలు నిర్వహిస్తారు, ఈ మహా యజ్ఞంలో ప్రముఖ నటి శిల్పా మంజునాథ్ పాల్గొన్నారు. నటుడు విజయ్ ఆంటోని నటించిన తమిళ చిత్రం కాళీలో హీరోయిన్‌గా నటించింది, మరియు వాలీ, సింగపెన్నే అనే తదితర చిత్రాల్లో నటించిన ఈమె ప్రత్యంగిరా అమ్మవారికి విశేష పూజల్లో పాల్గొన్నారు. ఆమె కుటుంబ సమేతంగా ఈ పూజల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ దేవాలయానికి ఆంధ్రప్రదేశ్ , కర్ణాటక, తమిళనాడు నుంచి ఎక్కువ మంది భక్తులు యజ్ఞంలో పాల్గొంటారు.



హోసూరు సిప్‌కాట్ సరస్సు ప్రక్షాళన పనులు పూర్తి

హోసూరు, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): హోసూరు కార్పొరేషన్ పరిధిలోని సిప్‌కాట్ సరస్సులో పూడిక తీత, ప్రక్షాళన పనులు పూర్తయ్యాయి. రూ.450 లక్షల వ్యయంతో 100 శాతం పూర్తయింది, మేయర్ సత్య ప్రజల ఉపయోగం కోసం ప్రారంభించామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ మహ్మద్ షబీర్ ఆలం, టైటాన్ కర్మాగారం మేనేజింగ్ డైరెక్టర్ వెంకట్రామన్, శ్రీధర్, మేనేజర్లు, శ్రీకాంత్ , కౌంజ్ అబ్బుల్లా, వినోద్, జగదీశ్వరన్, జోనల్ కమిటీ చైర్మెన్ రవి, రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వాహకులు శాంతి, చెన్నప్పన్, సీమరాజ్, దురైస్వామి, కాంతి, రాము, లారెన్స్ పాల్గొన్నారు.



రిబ్బన్ కట్‌చేసి ప్రారంభిస్తున్న మేయర్ సత్య, అధికారులు